RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ సీఎండీ & ఎడిటర్ 9701923260

సంపుటి: 4 సంచిక:123 | మే 06, 2026 | వెల: రూ.3-00

ఎన్ఓసీ, ఆస్తి విలువ సర్టిఫికెట్ కోసం

## లంచం డిమాండ్

రూ.20 వేలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారు లకు పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి



2లో

## రాజీనామా చేసే ప్రసక్తే లేదు



### మేం ఓడిపోలేదు.. మా గెలుపును దోచుకున్నారు

- 100 సీట్లలో ప్రజా తీర్పు దోపిడీ అయ్యింది
- ఈవీఎంలు, కౌంటింగ్‌పై అనుమానాలున్నాయి
- బీజేపీతో కాదు.. ఈసీతోనే మా ఫైట్
- అధికారం లేకపోయినా పోరాటం కొనసాగుతుంది
- మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు

2లో

## సీఎం పదవికి స్టాలిన్ రాజీనామా!

### తమిళనాడులో రాజకీయ సంచలనం

- కొళత్తూర్‌లో ఓటమి.. పాలిటిక్స్‌లో కీలక మలుపు
- కొత్త సమీకరణలకు నాంది పలికిన ఫలితాలు
- తాత్కాలిక సీఎంగా కొనసాగనున్న స్టాలిన్



2లో

# సాంకేతిక విప్లవం..

### 5జీ కంటే వంద రెట్లు వేగవంతమైన నెట్‌వర్క్

- సెకనుకు ఒక టెరాబిట్ డేటా బదిలీ సామర్థ్యం
- ప్రయోగాత్మక దశకు చేరుకోనున్న పరిశోధనల ప్రస్థానం
- అగ్రరాజ్యాల మధ్య పెరుగుతున్న సాంకేతిక పోటీ
- 6జీ రేసులో దూసుకుపోతున్న భారత్
- హోలోగ్రాఫిక్ కమ్యూనికేషన్ సరికొత్త విప్లవానికి నాంది
- వైద్య రోబోలను రియల్ టైమ్‌లో నియంత్రించే టెక్నాలజీ
- నెట్‌వర్క్ నిర్వహణలో కీలకం కానున్న ఏఐ

2లో




**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

*ప్రస్తుతం ప్రపంచం 5జీ వేగాన్ని ఆస్వాదిస్తున్నప్పటికీ, సాంకేతిక అగ్రరాజ్యాలు అప్పుడే తదుపరి తరం వైర్‌లెస్ విప్లవం అయిన 6జీ వైపు వేగంగా అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలో 2026 సంవత్సరం 6జీ ప్రస్థానంలో ఒక అత్యంత కీలకమైన మలుపుగా మారనుంది. ఇప్పటి వరకు కేవలం పరిశోధనా పత్రాలకే పరిమితమైన ఈ సాంకేతికత, ఇప్పుడు ప్రభుత్వ విధానాలు మరియు గ్లోబల్ స్టాండర్డ్స్ స్థాయికి చేరుకుంటోంది. 6జీ నెట్‌వర్క్ అనేది కేవలం ఇంటర్నెట్ వేగాన్ని పెంచడం మాత్రమే కాకుండా, కమ్యూనికేషన్ రంగంలో మనం ఊహించని విప్లవాత్మక మార్పులకు నాంది పలకనుంది. ముఖ్యంగా 5జీ కంటే సుమారు 100 రెట్లు వేగంగా, అంటే సెకనుకు 1 టెరాబిట్ వేగంతో డేటాను బదిలీ చేయగల సామర్థ్యం ఉండటం ఈ సాంకేతికత ప్రత్యేకత. దక్షిణ కొరియా, చైనా, అమెరికా వంటి దేశాలతో పాటు భారత్ కూడా 6జీ విజన్ ద్వారా ఈ రేసులో దూసుకుపోతోంది. హోలోగ్రాఫిక్ కమ్యూనికేషన్ నుండి ఏఐ ఆధారిత నెట్‌వర్క్ మేనేజ్‌మెంట్ వరకు మానవ జీవనశైలిని పూర్తిగా మార్చేయనున్న ఈ 6జీ విప్లవంపై ప్రత్యేక విశ్లేషణ...*

## శాసనసభా పక్ష నాయకుడిగా విజయ్



### త్వరలో ప్రభుత్వం ఏర్పాటుకు సన్నాహాలు

- గవర్నర్‌ను గడువు కోరిన తళపతి
- టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరణ
- మెజారిటీకి 10 సీట్లు దూరంలో..
- ఇతర పార్టీల మద్దతుపై ఉత్కంఠ

**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. తమిళగ వెట్రి కజగం పార్టీ 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించడంతో ప్రభుత్వం ఏర్పాటుకు కసరత్తు ప్రారంభమైంది. పార్టీ అధినేత విజయ్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథన్ అర్లేకర్కు లేఖ రాసి, ప్రభుత్వ ఏర్పాటు కోసం ఆహ్వానం ఇవ్వాలని కోరినట్లు సమాచారం. లోక్‌భవన్‌కు ఈమెయిల్ పంపిన ఆయన, తమ పార్టీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచిందని పేర్కొన్నారు. శాసనసభలో మెజారిటీ నిరూపణకు మరింత సమయం ఇవ్వాలని, 15 రోజుల్లో తమ సంఖ్యాబలం చూపిస్తామని విజయ్ విజ్ఞప్తి

మిగతా 2వ పేజీలో

## తెలంగాణలో ఏరోస్పేస్ రంగానికి కొత్త ఊపు



- శంషాబాద్‌లో ఏరోస్పేస్ యూనిట్‌కు శంకుస్థాపన
- రూ.453 కోట్లతో ఐటీపీ ఏరో ఇండియా ప్రాజెక్ట్ ప్రారంభం
- 2027 నాటికి పూర్తి స్థాయి కార్యకలాపాలు
- వందలాది నైపుణ్య ఉద్యోగాలకు అవకాశం
- పారిశ్రామికాభివృద్ధికి కీలక అడుగు
- మంత్రి శ్రీధర్ బాబు

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. శంషాబాద్ హార్డ్‌వేర్ పార్క్ మూడో దశలో ఐటీపీ ఏరో ఇండియా తయారీ యూనిట్‌కు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.453 కోట్ల పెట్టుబడితో 10 ఎకరాల్లో ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. తెలంగాణను ఏరోస్పేస్, ఆధునిక తయారీ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ఇది కీలకంగా మారనుందని

మిగతా 2వ పేజీలో



### జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ

- రూ.2360 కోట్లతో మెగా పారిశ్రామిక ప్రాజెక్ట్
- ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన
- లక్షలాది ఉద్యోగాలకు దారి చూపనున్న సిటీ

2లో

## ఢిల్లీ పర్యటనకు రేవంత్ రెడ్డి

### మెట్రో ఫేజ్-2పై దృష్టి

- కేంద్ర అనుమతుల కోసం కీలక భేటీలు
- పెండింగ్ ప్రాజెక్టులు, నిధులపై విజ్ఞప్తి
- జాతీయ రాజకీయాలపై కూడా చర్చలు జరిగే అవకాశం



**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు ఉదయం ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు అవసరమైన కేంద్ర అనుమతులపై ఆయన దృష్టి సారించనున్నట్లు సమాచారం. ఢిల్లీలో కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు అందాల్సిన నిధులపై ముఖ్యమంత్రి విజ్ఞప్తులు చేయనున్నారు. ముఖ్యంగా మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను వేగవంతం చేయాలనే అంశంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. పాలనాపరమైన అంశాలతో పాటు జాతీయ రాజకీయాలపైనా ఈ పర్యటనలో చర్చలు జరిగే అవకాశం ఉంది. ఏఐసీసీ అగ్రనేతలతో సీఎం సమావేశమై

మిగతా 2వ పేజీలో

వేద న్యూస్

బుధవారం మే 06, 2026

# సీఎం పదవికి స్టాలిన్ రాజీనామా!

**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తన పదవికి రాజీనామా చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఎదురైన ఘోర పరాజయం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ రాజేంద్ర విశ్వనాథన్ అర్లేకర్కు సమర్పించారు. కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసే వరకు తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగనున్నారు. కొళత్తూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన స్టాలిన్ ఈసారి ఓటమి పాలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అధికారంలో ఉన్న నాయకుడు తన సొంత నియోజకవర్గంలో ఓడిపోవడం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద మార్పుకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక ఈ ఎన్నికల్లో నటుడు–రాజకీయ నాయకుడు విజయ్ రెండు స్థానాల్లో పోటీ చేసి రెండింటిలోనూ విజయం సాధించడం విశేషంగా నిలిచింది. ఇది రాష్ట్ర రాజకీయాల్లో కొత్త శక్తి ఎదుగుదలకు సంకేతంగా పేర్కొంటున్నారు. ఈ ఫలితాలతో తమిళనాడులో అధికార మార్పిడి దిశగా పరిణామాలు వేగంగా సాగుతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉండగా, రాజకీయ సమీకరణాలు మారే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రజల తీర్పుతో వచ్చిన ఈ మార్పులు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతున్నాయి.

# జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణలో పారిశ్రామిక రంగానికి భారీ ఊతం ఇవ్వనున్న జహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు మే 10న ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి వివరాలను వెల్లడించారు. హైదరాబాద్–నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ మొత్తం రూ.2360.54 కోట్ల వ్యయంతో అమలు కానుంది. సుమారు 3,245 ఎకరాల్లో విస్తరించనున్న ఈ స్మార్ట్ సిటీ ఆధునిక మౌలిక వసతులతో కూడిన సమగ్ర పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రూ.10వేల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. 2029 నాటికి దాదాపు 1.74 లక్షల ఉద్యోగాలు సృష్టించబడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. లాజిస్టిక్స్, ఆటో భాగాలు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, లోహాలు, ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. స్మార్ట్ టెక్నాలజీతో కూడిన మౌలిక వసతులు, పర్యావరణ హిత అభివృద్ధి విధానాలు ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకతగా నిలవనున్నాయి. ప్లగ్–అండ్–ప్లే పారిశ్రామిక సదుపాయాలతో పాటు నివాస, వాణిజ్య ప్రాంతాలు, పాఠశాలలు, శిక్షణ కేంద్రాలు వంటి సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. వ్యూహాత్మకంగా హైదరాబాద్–నాగ్‌పూర్ కారిడార్‌లో ఉన్న ఈ ప్రాంతం భవిష్యత్తులో ప్రధాన తయారీ, లాజిస్టిక్స్ హబ్‌గా మారనుందని నిపుణులు భావిస్తున్నారు. ఇది తెలంగాణ ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారనుంది. పారిశ్రామిక కారిడార్ అభివృద్ధిని వేగవంతం చేస్తూ భారత్‌ను గ్లోబల్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడంలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు నాంది పలకనుంది.

# రాజీనామా చేసే ప్రసక్తే లేదు

**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**

వెస్ట్ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై సీఎం మమతా బెనర్జీ తీవ్ర విమర్శలు చేశారు. ఈ ఎన్నికల్లో తాము ప్రజా తీర్పుతో ఓడిపోలేదని, కుట్ర ద్వారా తమ గెలుపును దోచుకున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో సీఎం పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఫోన్ చేసి సంఘీభావం తెలిపినట్లు ఆమె తెలిపారు. ఇకపై ఇండియా కూటమిని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఎన్నికల కౌంటింగ్‌లో భారీ అవకతవకలు జరిగాయని, దాదాపు 100 స్థానాల్లో ప్రజా తీర్పును దోచుకున్నారని ఆరోపించారు. కౌంటింగ్ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా నెమ్మదింపజేసి పార్టీ మనోధైర్యాన్ని దెబ్బతీయాలని చూశారని అన్నారు. గవర్నర్‌ను కలిసే ఆలోచన లేదని, అధికారం లేకపోయినా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరించిందని ఆరోపిస్తూ, ఈ ఎన్నికల్లో తమ పోటీ బీజేపీతో కాకుండా ఈసీతోనేనని వ్యాఖ్యానించారు. ఈవీఎంల పనితీరుపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తూ, ఓటింగ్ అనంతరం కూడా 80–90 శాతం ఛార్జింగ్ ఎలా ఉందని ప్రశ్నించారు. మొదటి రౌండ్ కౌంటింగ్ పూర్తయ్యాకే బీజేపీకి 195–200 సీట్లు వస్తాయని ఎలా ప్రకటించారో వివరించాలని డిమాండ్ చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని, తాను ముందంజలో ఉన్నప్పటికీ బాహ్య వ్యక్తులు, భద్రతా సిబ్బంది కేంద్రాల్లోకి ప్రవేశించారని ఆరోపించారు. "మేం ఓడిపోలేదు.. మా గెలుపును దొంగిలించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాటం కొనసాగిస్తాం" అని మమతా బెనర్జీ స్పష్టం చేశారు.

# ఎన్ఓసీ, ఆస్తి విలువ సర్టిఫికెట్ కోసం లంచం డిమాండ్

**వేద న్యూస్, రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం. శరత్ కుమార్ లంచం స్వీకరిస్తూ ఏసీబీ అధికారుల చేతిలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ తెలంగాణ అధికారులు ఈ చర్యను చేపట్టారు. వివరాల ప్రకారం.. శరత్ కుమార్ మొదట ఫిర్యాదుదారుని నుంచి రూ.30వేలు లంచం డిమాండ్ చేయగా, తరువాత దాన్ని రూ.20వేలకు తగ్గించి స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారుని సైట్ వివరాలను ఆన్లైన్‌లో అప్లోడ్ చేసి, ఎన్ఓసీ మరియు ఆస్తి విలువ సర్టిఫికేట్ జారీ చేయడానికి ఈ లంచం తీసుకున్నట్లు వెల్లడించారు. ఏసీబీ అధికారులు నిర్వహించిన ట్రాప్ ఆపరేషన్‌లో శరత్ కుమార్ నుంచి రూ.20వేలు లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతన్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేసినట్లయితే వెంటనే స్పందించాలని ఏసీబీ అధికారులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబర్ 1064, వాట్సాప్ 9440446106, ఫేస్‌బుక్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. అవినీతి నిరోధానికి ప్రజల సహకారం అవసరమని అధికారులు పేర్కొన్నారు.

# సాంకేతిక విప్లవం..

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**




- 5జీ కంటే వంద రెట్లు వేగవంతమైన నెట్‌వర్క్
- సెకనుకు ఒక టెరాబిట్ డేటా బదిలీ సామర్థ్యం
- ప్రయోగాత్మక దశకు చేరుకోనున్న పరిశోధనల ప్రస్థానం
- అగ్రరాజ్యాల మధ్య పెరుగుతున్న సాంకేతిక పోటీ
- 6జీ రేసులో దూసుకుపోతున్న భారత్
- హోలోగ్రాఫిక్ కమ్యూనికేషన్ సరికొత్త విప్లవానికి నాంది
- వైద్య రోబోలను రియల్ టైమ్‌లో నియంత్రించే టెక్నాలజీ
- నెట్‌వర్క్ నిర్వహణలో కీలకం కానున్న ఏఐ

ప్రస్తుతం ప్రపంచం 5జీ వేగాన్ని ఆస్వాదిస్తున్నప్పటికీ, సాంకేతిక అగ్రరాజ్యాలు అప్పుడే తదుపరి తరం వైర్‌లెస్ విప్లవం అయిన 6జీ వైపు వేగంగా అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలో 2026 సంవత్సరం 6జీ ప్రస్థానంలో ఒక అత్యంత కీలకమైన మలుపుగా మారనుంది. ఇప్పటి వరకు కేవలం పరిశోధనా పత్రాలకే పరిమితమైన ఈ సాంకేతికత, ఇప్పుడు ప్రభుత్వ విధానాలు మరియు గ్లోబల్ స్టాండర్డ్స్ స్థాయికి చేరుకుంటోంది. 6జీ నెట్‌వర్క్ అనేది కేవలం ఇంటర్నెట్ వేగాన్ని పెంచడం మాత్రమే కాకుండా, కమ్యూనికేషన్ రంగంలో మనం ఊహించని విప్లవాత్మక మార్పులకు నాంది పలకనుంది. ముఖ్యంగా 5జీ కంటే సుమారు 100 రెట్లు వేగంగా, అంటే సెకనుకు 1 టెరాబిట్ వేగంతో డేటాను బదిలీ చేయగల సామర్థ్యం దీనికి ఉండటం విశేషం.

### అగ్రరాజ్యాల మధ్య సాంకేతిక సమరం

ప్రస్తుతం 6జీ అభివృద్ధిలో దక్షిణ కొరియా, చైనా, జపాన్, అమెరికా మరియు ఫిన్లాండ్ వంటి దేశాలు పోటాపోటీగా ముందంజలో ఉన్నాయి. ఈ దేశాలు ఇప్పటికే 6జీ మౌలిక సదుపాయాల కల్పన కోసం బిలియన్ల కొద్దీ డాలర్లను కేటాయించాయి. ముఖ్యంగా చైనా మరియు దక్షిణ కొరియా దేశాలు 2030 నాటికి వాణిజ్యపరంగా 6జీ సేవలను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. టెరాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌ను ఉపయోగించడం ద్వారా అత్యంత తక్కువ లాటెన్సీతో డేటా ప్రసారం చేయడం ఈ దేశాల ప్రధాన వ్యూహం. ఈ పోటీ కేవలం సాంకేతిక అప్‌గ్రేడ్ మాత్రమే కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థపై పట్టు సాధించే వ్యూహంగా కూడా కనిపిస్తోంది.

### 6జీ రేసులో దూసుకుపోతున్న భారత్

భారతదేశం కూడా ఈ ప్రపంచ స్థాయి 6జీ రేసులో తన ఉనికిని బలంగా చాటుకుంటోంది. భారత ప్రభుత్వం ఇప్పటికే భారత్ 6జీ విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసి, తన ప్రణాళికలను స్పష్టం చేసింది. ఫిబ్రవరి 2026 నాటికి, 6జీ పరిశోధన మరియు అభివృద్ధి కోసం దాదాపు 104 ప్రాజెక్టులకు సుమారు ₹271 కోట్ల నిధులను కేంద్రం మంజూరు చేసింది. 5జీ విస్తరణలో ప్రపంచ రికార్డు సృష్టించిన ఉత్సాహంతో ఉన్న భారత్, ఇప్పుడు అంతర్జాతీయ 6జీ ప్రమాణాల రూపకల్పనలో తొలిసారిగా భాగస్వామి అవుతోంది. దాదాపు 30కి పైగా దేశాలతో పొత్తులు పెట్టుకుంటూ, స్వదేశీ పరిజ్ఞానంతో 6జీ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది.

### హోలోగ్రాఫిక్ కమ్యూనికేషన్, ఏఐ అప్లికేషన్లు

6జీ సాంకేతికత అనేది కేవలం ఫోన్ కాల్స్ లేదా వీడియో స్ట్రీమింగ్‌కు మాత్రమే పరిమితం కాదు. ఇది హోలోగ్రాఫిక్ కమ్యూనికేషన్, డిజిటల్ ట్విన్స్ మరియు అడ్వాన్స్‌డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక అప్లికేషన్లకు వెన్నెముకగా నిలవనుంది. ఉదాహరణకు, 6జీ సాయంతో సుదూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులు హోలోగ్రామ్ రూపంలో మన కళ్ల ముందే ఉన్నట్లుగా సంభాషించే అవకాశం ఉంటుంది. అలాగే, శస్త్రచికిత్సలు చేసే సమయంలో రోబోలను రియల్ టైమ్‌లో నియంత్రించడానికి ఈ నెట్‌వర్క్ ఎంతో కీలకం కానుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది 6జీ నెట్‌వర్క్‌లో ఒక అంతర్భాగంగా ఉండి, నెట్‌వర్క్ రద్దీని అంచనా వేయడం మరియు ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరచడం వంటి పనులను స్వయంచాలకంగా నిర్వహిస్తుంది.

### సవాళ్లు, భవిష్యత్తు లక్ష్యాలు

అయితే, ఈ అద్భుత సాంకేతికత అమలులో కొన్ని క్లిష్టమైన సవాళ్లు కూడా ఉన్నాయి. 6జీలో ఉపయోగించే టెరాహెర్ట్జ్ తరంగాలు చాలా తక్కువ దూరం మాత్రమే ప్రయాణించగలవు మరియు భవనాల వంటి అడ్డంకులను దాటడం వీటికి కష్టం. వీటిని అధిగమించేందుకు శాస్త్రవేత్తలు ఇంటెలిజెంట్ రిఫ్లెక్టింగ్ సర్ఫేసెస్ వంటి సరికొత్త ఆవిష్కరణలపై నిరంతరం పరిశోధనలు చేస్తున్నారు. ప్రస్తుతం 2026 నుండి 2028 మధ్య కాలంలో 6జీ ప్రోటోటైప్ టెస్టింగ్ మరియు ట్రయల్స్ నిర్వహించాలని అంతర్జాతీయ సంస్థలు భావిస్తున్నాయి. పూర్తిస్థాయిలో వాణిజ్యపరంగా 6జీ సేవలు 2030 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. భవిష్యత్తులో మానవ జీవనశైలిని మరియు కమ్యూనికేషన్ పద్ధతులను పూర్తిగా మార్చేసే ఈ సాంకేతిక విప్లవం కోసం ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# ఐకేపీ కేంద్రాల్లో అక్రమ వసూళ్లు!

- ధాన్యం లోడింగ్ కోసం అదనపు డబ్బులు డిమాండ్
- బస్తాకు రూ.2 డిమాండ్‌పై రైతుల ఆగ్రహం
- లారీ కాంట్రాక్టర్లు, డ్రైవర్ల తీరుపై విమర్శలు
- రైతులపై పెరుగుతున్న ఆర్థిక భారం
- అధికారులు స్పందించాలని డిమాండ్

**వేద న్యూస్, ఇల్లంతకుంట**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో వేసవికాల పంట కోతలు పూర్తవడంతో రైతులు తమ ధాన్యాన్ని అమ్మేందుకు ఐకేపీ కేంద్రాల్లో పోసి తూకం కోసం ఎదురు చూస్తున్నారు. సాధారణంగా ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు సమయంలో బస్తాల్లో నింపడం, తూకం వేయడం, లారీల్లో లోడింగ్ చేయడం వంటి ఖర్చులను ప్రభుత్వం భరిస్తుంది. అయితే మండలంలోని పలు ఐకేపీ కేంద్రాల్లో దీనికి విరుద్ధంగా పరిస్థితులు నెలకొన్నాయి. లారీ కాంట్రాక్టర్లు, డ్రైవర్లు ధాన్యాన్ని బస్తాల్లో నింపి లారీల్లో లోడ్ చేయాలంటే బస్తాకు రూ.2 చొప్పున అదనంగా చెల్లించాలని రైతులను డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. అసలు ఈ రెండు రూపాయలు ఎందుకు ఇవ్వాలి? ఖర్చులు ప్రభుత్వమే భరిస్తున్నప్పుడు మాకు అదనపు భారమేమిటి? అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యంపై ఇలాంటి కట్టింగ్‌లు, కమిషన్లు విధించడం అన్యాయమని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు దీనిపై ప్రశ్నిస్తే, మా ఇష్టం.. లోడింగ్ కావాలంటే బస్తాకు రూ.2 ఇవ్వాలి.. లేదంటే మీ ఇష్టం అంటూ బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో లారీలు అందుబాటులోకి రాకపోవడంతో ధాన్యం నిల్వలు పేరుకుపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిపై సంబంధిత శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి విచారణ జరిపించాలని రైతులు కోరుతున్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న లారీ కాంట్రాక్టర్లు, డ్రైవర్లపై చర్యలు తీసుకుని రైతులపై పడుతున్న అదనపు భారాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

# మంత్రి కొండా సురేఖ రాజీనామా చేయాలి

**వేద న్యూస్, వరంగల్**

- శ్రీరాముడిపై వ్యాఖ్యలు సిగ్గుచేటు..
- హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి
- బేషరతుగా క్షమాపణ చెప్పాలి.. లేదంటే అడ్డుకుంటాం
- కేంద్ర నిధులపై మంత్రి వ్యాఖ్యలు అసత్యం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, వెంటనే మంత్రి పదవికి రాజీనామా చేయాలని వరంగల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన, 'శ్రీరాముడిని పూజిస్తే పైసలు రాలుతాయా' అనే వ్యాఖ్యలు అనుచితమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పకుంటే ఎక్కడికక్కడే అడ్డుకుంటామని హెచ్చరించారు. దేవాదాయ శాఖ మంత్రి అయ్యి ఉండి హిందూ దేవుళ్లను అవమానించడం దురదృష్టకరమని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ హిందువుల భావాలను గౌరవించడం లేదని ఆరోపించిన ఆయన, మంత్రి సురేఖ తన పదవిని కాపాడుకోవడానికే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో కూడా హిందూ భావాలను అవమానించిన నేతలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర నిధులపై మంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, ఉమ్మడి వరంగల్ జిల్లాకు మామునూరు ఎయిర్‌పోర్టు, స్మార్ట్ సిటీ, హృదయ్ పథకం, గిరిజన యూనివర్సిటీ, రైల్వే ఫ్యాక్టరీ వంటి అనేక ప్రాజెక్టులు కేంద్రం అందించిందని పేర్కొన్నారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీపై చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ, రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చినప్పుడు ఏ భాషలో మాట్లాడారో చెప్పాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మతాల మధ్య విభేదాలు సృష్టిస్తోందని ఆయన ఆరోపించారు.

# తెలంగాణలో ఏరోస్పేస్ రంగానికి కొత్త ఊపు



**మొదటి పేజీ తరువాయి**

అధికారులు తెలిపారు. ఈ యూనిట్ 2027 నాటికి పూర్తి స్థాయి కార్యకలాపాలు ప్రారంభించనుంది. ప్రారంభ దశలో సుమారు 350 మంది నైపుణ్య ఉద్యోగులకు ఉపాధి లభించనుండగా, తరువాతి దశల్లో ఈ సంఖ్య 600 వరకు పెరిగే అవకాశం ఉంది. ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఆధునిక తయారీ, నాణ్యత నియంత్రణ వంటి విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షిస్తూ సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి దోహదపడతాయని, యువతకు ఉన్నత స్థాయి ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తూ తెలంగాణను పారిశ్రామిక, ఆవిష్కరణల కేంద్రంగా అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# ఢిల్లీ పర్యటనకు రేవంత్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి**

తాజా రాజకీయ పరిస్థితులపై అభిప్రాయాలు పంచుకోనున్నారు. ఇటీవల కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి సాధించిన విజయంతో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. కేరళ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కేరళ ముఖ్యమంత్రి ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతుండగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో కేరళ రాజకీయ పరిణామాలపై కూడా చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ పర్యటన రాష్ట్రానికి అవసరమైన అనుమతులు, నిధుల సాధనలో కీలకంగా మారుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

# శాసనసభా పక్ష నాయకుడిగా విజయ్

**మొదటి పేజీ తరువాయి**

చేసినట్లు తెలుస్తోంది. గవర్నర్ నుంచి త్వరలోనే ఆహ్వానం వచ్చే అవకాశం ఉందని, బలనిరూపణకు 7 నుంచి 15 రోజుల గడువు ఇవ్వవచ్చని సమాచారం. తమిళనాడు అసెంబ్లీలో మెజారిటీకి అవసరమైన సంఖ్య 118 కాగా, టీవీకే 108 స్థానాలతో 10 సీట్ల దూరంలో నిలిచింది. దీంతో ఇతర పార్టీల మద్దతు కీలకంగా మారింది. ఎవరు మద్దతు ఇస్తారన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. అలాగే టీవీకే శాసనసభా పక్ష నాయకుడిగా విజయ్‌ను ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. రాష్ట్రంలో త్వరలోనే కొత్త ప్రభుత్వం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వేద న్యూస్

బుధవారం మే 06, 2026

## ఉపాధి కూలీలకు అల్పాహారం పంపిణీ



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని చెరువులో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడిన నాయకులు, కార్మికుల శ్రమకు గుర్తింపుగా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, కర్క అశోక్, వార్డు సభ్యులు ఆమంద్ వెంకటేష్, శివ, నాయకులు బర్ల చిట్టి, వడ్ల నరేష్, ఇందూర్ కార్తీక్, సాయి లక్ష్మణ్ తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**వేద న్యూస్, రామడుగు:**

మండల కేంద్రంలో వేర్వేరు కారణాలతో మృతి చెందిన వృద్ధురాలు ఈసల లక్ష్మి నర్సమ్మ, మూడు సంవత్సరాల బాలుడు నూనె నిషాంత్ కుటుంబాలకు ఎన్ఆర్ఐ తోట సత్యం ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటారు. బాధిత కుటుంబాల ఆర్థిక పరిస్థితి గురించి గ్రామస్తులు అమెరికాలో ఉన్న సత్యంకు సమాచారం అందించగా, ఆయన వెంటనే స్పందించి రూ. 20వేలను వార్డు సభ్యుడు సిరిగిరి వెంకటేశం ద్వారా అందజేశారు. ఈ సహాయంతో కుటుంబాలకు కొంత ఊరట లభించిందని గ్రామస్తులు తెలిపారు. సత్యం మానవతా దృక్పథాన్ని గ్రామస్థులు ప్రశంసించారు.



## వడ్లు కొనుగోలు చేయాలని తహసీల్దార్‌కు వినతి



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండలం గుమ్లాపూర్ గ్రామ రైతులు వడ్లు వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఐకేపీ, నాబార్డ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై 25 రోజులు గడిచినా ఇప్పటివరకు సరైన కొనుగోళ్లు జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు ఒక్క లారీ కూడా వడ్లు కొనుగోలు చేయడం లేదని, కారణం అడిగితే రైస్ మిల్లులు దూరంగా కేటాయించడంతో రవాణా సమస్యలు ఉన్నాయని నిర్వాహకులు చెబుతున్నారని తెలిపారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం బి గ్రేడ్ పేరుతో రైతులను నష్టపరుస్తోందని ఆరోపించారు. తక్షణమే కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని, లేదంటే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బత్తుల లక్ష్మీనారాయణ, విలాసాగర్ అంజయ్య, సత్యనారాయణ రెడ్డి, కాసవేని శంకర్, లక్ష్మారెడ్డి తదితరులు, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా గండ్ర జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, శాయంపేట :**



భూపాలపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి జన్మదిన వేడుకలను శాయంపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గండ్ర వెంకటరమణారెడ్డి ఆయురారోగ్యాలతో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, భూపాలపల్లి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామశాఖ నాయకులు, యూత్ నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, రైతుబంధు సమితి నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తీపి మాటున దాగున్న విషం!

- రసాయనాలతో మగ్గపెడుతున్న మామిడి పండ్లు
- ప్రజల ఆరోగ్యంతో వ్యాపారుల చెలగాటం
- కాల్షియం కార్బైడ్, ఇథిలిన్ తో అనారోగ్య సమస్యలు
- పిల్లలు, వృద్ధులపై అధికంగా ప్రభావం
- పట్టించుకోని అధికారులు



**వేద న్యూస్, నల్లగొండ :**

వేసవికాలంలో మామిడి పండ్లకు భారీ డిమాండ్ ఉండటంతో కొంతమంది వ్యాపారులు రసాయనాలతో పండ్లను మగ్గబెట్టి విక్రయాలు చేస్తున్నారనే ఆరోపణలు జిల్లాలో వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ముప్పు ఏర్పడుతోందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్లపై సహజంగా పండిన మామిడి పండ్లకు ప్రత్యేక రుచి ఉండగా, కొంతమంది వ్యాపారులు స్వలాభం కోసం ముందుగానే పండ్లను రసాయనాలతో మగ్గబెట్టి మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంతో పాటు మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా, నాగార్జునసాగర్, నకిరేకల్, చిట్యాల ప్రాంతాల్లో మామిడి వ్యాపారం ఎక్కువగా జరుగుతోంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన మామిడి పండ్లను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే క్రమంలో ఇతిలిన్ వంటి రసాయనాలను వినియోగిస్తున్నారని సమాచారం. అలాగే కాల్షియం కార్బైడ్, ఇతిలిన్ ఎతోపాస్ వంటి రసాయనాలను పండ్ల మధ్య ఉంచి వేగంగా పండించడంతో పసుపు రంగులో మెరిసేలా మారుస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి రసాయనాలతో మగ్గబెట్టిన మామిడి పండ్లు ఆరోగ్యానికి హానికరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లల్లో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అంటున్నారు. అయినా సంబంధిత అధికారులు ఈ అంశంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తనిఖీలు నిర్వహించి, రసాయనాల వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు

### - ఆయిల్ పామ్, ప్రత్యామ్నాయ పంటలపై మార్గదర్శనం

**వేద న్యూస్, చొప్పదండి:**

ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా చొప్పదండి డివిజన్ పరిధిలోని గంగాధర, రామడుగు, చొప్పదండి మండలాల రైతులకు ఉద్యాన పంటల సాగు, ఆయిల్ పామ్ విస్తీర్ణ పెంపు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యాన అధికారి రోహిత్ వినూత్నంగా నిర్వహించి, అభ్యుదయ రైతులను సన్మానించారు. రైతులు తమ అనుభవాలు, పంటల విధానం, ప్రభుత్వ ప్రోత్సాహకాలను ఇతర రైతులతో పంచుకున్నారు. సదస్సుకు రైతుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో మహేష్, రాజేందర్ రెడ్డి, ప్రియదర్శిని, హరికృష్ణ, మమత రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, మూడు మండలాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.



## నూర్జహాన్ మృతి కార్మిక వర్గానికి తీరని లోటు

### - సంతాప సభలో సీఐటీయూ నాయకులు

**వేద న్యూస్, రుద్రూర్ :**



సీఐటీయూ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అకాల మృతి కార్మిక వర్గానికి తీరని లోటని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ అన్నారు. మంగళవారం రుద్రూర్ పీహెచ్‌సీలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు నూర్జహాన్ సంతాప సభ నిర్వహించి, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నన్నేసాబ్, ఆశా యూనియన్ మండల కార్యదర్శి వాణి మాట్లాడుతూ, నూర్జహాన్ పోరాటానికి మారుపేరని, ఆశా కార్యకర్తల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన నేతగా కొనియాడారు. ఆమె ఆశయ సాధన కోసం చూపిన పోరుబాటలోనే ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ మండలాధ్యక్షురాలు భూలక్ష్మి, నాయకులు నిర్మల, నాగమణి, రంజన, రాధ, బాలమణి, ఉదయలక్ష్మి, ప్రవళిక, పుష్ప, గంగామణి, మాధవి తదితరులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## టెన్త్ ఫెయిల్ విద్యార్థులకు నేటి నుంచి ప్రత్యేక తరగతులు

**వేద న్యూస్, పాపన్నపేట :**

ఇటీవల నిర్వహించిన ఎస్ఎస్సీ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ నెల 6వ తేదీ నుండి పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుండి 11:30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని, విద్యార్థులకు అల్పాహారం అందించడంతో పాటు రవాణా ఖర్చులు కూడా భరించనున్నట్లు పేర్కొన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు అందరూ తప్పనిసరిగా ఈ తరగతులకు హాజరయ్యేలా సంబంధిత ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు.



# 3 నెలల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలి

**- డీఎంఅండ్‌హెచ్‌ఓకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వినతి**



**వేద న్యూస్, జగిత్యాల:**

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రావాల్సిన మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) సభ్యులు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధి చందు మాట్లాడుతూ, ఉద్యోగులకు నెలల తరబడి వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేతనాల ఆలస్యంతో ఇంటి కిరాయి, విద్యుత్ బిల్లులు, పిల్లల విద్యా ఖర్చులు, ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ లోపు వేతనాలు విడుదల చేయకపోతే 26వ తేదీ నుంచి లంచ్ సమయంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌సీయూ సిబ్బంది, కాంట్రాక్ట్ ఉద్యోగులు, సపోర్టింగ్ స్టాఫ్, కాంటిజెంట్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు రాజేందర్, సునీత, బడుగు శిరీష తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం మొత్తం కేంద్రం తీసుకోవాలి



- బయో గ్యాస్ ప్లాంట్‌లతో రైతులకు అదనపు ఆదాయం
- పంట వ్యర్థాలు కాల్చొద్దు
- ఆధునిక సాగు వైపు అడుగులు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- గంభీరావుపేటలో బయో గ్యాస్ ప్లాంట్‌కు శంకుస్థాపన

**వేద న్యూస్, గంభీరావుపేట :**

రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం మొత్తం కొనుగోలు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. గంభీరావుపేటలో ఏర్పాటు చేస్తున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం ఆయన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో రైతులు పండించిన ప్రతి పంటను కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా చేయాలని సూచిస్తూ, దీని ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని చెప్పారు. గడ్డిని కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుందని, బయో గ్యాస్ ఉత్పత్తి ద్వారా పర్యావరణ రక్షణతో పాటు ఆదాయం కూడా పొందవచ్చని వివరించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానం పాటించాలని, వరితో పాటు ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు. ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, డీఎస్పీ నాగేంద్రాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచ్ మల్లుగారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్ ఇండియాకు ఊతం.. ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు

- రూ. కోటితో 17 డివిజన్లలో జిమ్‌లు
- కిసాన్‌నగర్, దుర్శేడు లో ప్రారంభించిన కేంద్ర మంత్రి
- మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర నిధులు బండి సంజయ్



**వేద న్యూస్, కరీంనగర్ :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'ఫిట్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా నగర ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. నాల్కో సంస్థ సీఎస్ఆర్ నిధులతో, మలయప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని 17 డివిజన్లలో దాదాపు రూ. కోటి వ్యయంతో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా కిసాన్‌నగర్, దుర్శేడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జిమ్‌లను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నగర ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెంచుకుని ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మలయప్ప ఫౌండేషన్ ప్రతినిధులు కూడా సీఎస్ఆర్ నిధులను సమర్థంగా వినియోగిస్తూ ఈ ప్రాజెక్టులను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ఘనంగా రాయల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు



**వేద న్యూస్, ఖమ్మం:**

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు జన్మదిన వేడుకలను నేలకొండపల్లిలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాయల నాగేశ్వరరావు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నూతన గోదాములు నిర్మిస్తూ సంస్థను అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని కొనియాడారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. వేడుకల్లో భాగంగా మహిళలు నృత్యాలు చేస్తూ సంబరాల్లో పాల్గొన్నారు. "రాయల నాయకత్వం వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జెర్రిపోతుల అంజనీ, బొడ్డు బొంద్దయ్య, బోయిన వేణు తదితరులు, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పేదల కోసం పోరాడిన కమ్యూనిస్టు నేత

**- ఘనంగా భూక్య బావుసింగ్ వర్ధంతి**



**వేద న్యూస్, కారేపల్లి :**

పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం జీవితమంతా పోరాడిన కమ్యూనిస్టు నాయకుడు భూక్య బావుసింగ్ అందరికీ ఆదర్శమని సీపీఎం సింగరేణి మండల కార్యదర్శి కే నరేంద్ర పేర్కొన్నారు. భూక్య బావుసింగ్ నాలుగో వర్ధంతి సందర్భంగా నాను నగర్ తండాలో జరిగిన సభలో పార్టీ మండల కమిటీ సభ్యుడు యనమనగండ్ల రవిబాబు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ, చీమలపాడు ప్రాంతంలో జరిగిన ప్రజా పోరాటాల్లో బావుసింగ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. సీపీఎం అమరజీవి మాలోతు నాను నాయక్ పేరిట ఏర్పడిన నాను నగర్ తండా అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తుచేశారు. ప్రజా సమస్యలపై చివరి వరకు సమరశీల పోరాటం చేసిన నేతగా ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అంతర్జాతీయ, జాతీయ రాజకీయ పరిణామాలపై స్పందిస్తూ, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం అవసరమని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలపై విమర్శలు చేస్తూ, రైతులకు కనీస మద్దతు ధర చట్టబద్ధ హామీ, ఉపాధి హామీ పథకం బలోపేతం అవసరమని అన్నారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లు కారేపల్లి మండలానికి అందేలా ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. భూక్య బావుసింగ్‌కు నిజమైన నివాళి అంటే ప్రజా సమస్యలపై పోరాటమేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్తూపం వద్ద జెండా ఆవిష్కరణ, పూలమాలల సమర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వజ్జా రామారావు, పార్టీ నాయకులు, గ్రామస్తులు, భూక్య బావుసింగ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన కాదు.. ప్రజా వంచన

- రైతు భరోసా అమలులో ప్రభుత్వం ఫెయిల్
- ధాన్యం కొనుగోళ్లలో జాప్యం
- రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి



**వేద న్యూస్, జగిత్యాల:**

రాష్ట్రంలో ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. జగిత్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇది ప్రజా పాలన కాదని, ప్రజా వంచన పాలన అని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర జాప్యం కారణంగా రైతులు ఎండల్లో రోడ్డెక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర సక్రమంగా అందడం లేదని, తూకం వేసిన ధాన్యాన్ని 24 గంటల్లోగా అన్‌లోడ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. రైతు భరోసా పథకాన్ని పూర్తిగా అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మూడు పంటల రైతు భరోసా హామీ నిలబెట్టలేదని, రుణమాఫీ కూడా సగం మందికే పరిమితమైందని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీ ఛైర్పర్సన్ దావా వసంత సురేష్, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ హరిచరన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మతాల ఐక్యతకు ప్రతీకగా దర్గా

**- ఎమ్మెల్యే శంకర్**



**వేద న్యూస్, షాద్‌నగర్ :**

మతాల ఐక్యతను చాటుతూ అందరినీ ఆధ్యాత్మిక మార్గంలో నడిపించేవే దర్గాలు అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ఉప్పరిగడ్డ సర్పంచ్ చందు నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉర్సు ఉత్సవాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఇద్రీస్, చించోడు అనంతం తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్
బుధవారం మే 06, 2026

# మదన్ లాల్ ఆశయ సాధనే లక్ష్యం

- వైరా మాజీ ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ శ్రేణుల నివాళి



**వేద న్యూస్, కారేపల్లి :**

వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, ప్రజల మనిషి దివంగత బానోత్ మదన్ లాల్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని కారేపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మదన్ లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి మదన్ లాల్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఎమ్మెల్యేగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతగా గుర్తు చేసుకున్నారు. ఆయన లేని లోటు పార్టీకి, ప్రజలకు తీరనిదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ మైనార్టీ విభాగం జిల్లా నాయకుడు గౌసుద్దీన్ మాట్లాడుతూ.. మదన్ లాల్ కార్యకర్తలకు మార్గదర్శకులు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల స్థాయి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అశ్రునయనాలతో నివాళులర్పించారు. నియోజకవర్గ ప్రజల గుండెల్లో మదన్ లాల్ పేరు చిరస్థాయిగా నిలుస్తుందని నినదించారు.

# మొక్కజొన్న రైతుల అరిగోస

- ఎకరాకు 35 క్వింటాళ్లు కొనాలి
- ప్రభుత్వంపై రసమయి బాలకిషన్ విమర్శలు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని కేషన్నపల్లి గ్రామ రైతులు మొక్కజొన్న పంట అమ్మకాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఇల్లంతకుంట నుంచి బెజ్జంకి వెళ్తున్న సమయంలో కేషన్నపల్లి వద్ద రైతులు మొక్కజొన్న కంకులు ఏరుతున్న దృశ్యం గమనించిన బాలకిషన్, వాహనం ఆపి రైతు ప్రభాకర్ వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడును వ్యక్తం చేస్తూ, మొక్కజొన్నలు పండించి అమ్ముకునేందుకు అరిగోస పడుతున్నాం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎకరాకు 26 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే కొనుగోలు చేయడంతో మిగతా పంటను దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని, దీంతో నష్టపోతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ నేపథ్యంలో రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతులు పండించిన మొక్కజొన్నలను ఎకరాకు కనీసం 35 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునే సమయంలో ప్రభుత్వం పూటకో నిబంధన పెడుతూ ఇబ్బందులు కలిగిస్తోందని, దళారుల చేతిలో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవరోధాలు లేకుండా మొక్కజొన్న కొనుగోలు చేయాలని కోరారు.




# కారేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



**వేద న్యూస్, కారేపల్లి :**

కారేపల్లి మండల కేంద్రంలోని సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా దుగ్గినేని శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు తీర్పు మేరకు జిల్లా సొసైటీ పర్సనల్ ఇన్‌చార్జి మేరీ కుమారి చేతుల మీదుగా సొసైటీ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సొసైటీ ద్వారా మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. యూరియా, ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించి సొసైటీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ బొల్లు హనుమంతరావు, డైరెక్టర్లు అడ్డగోడ ఐలయ్య, డేగల ఉపేందర్, సిబ్బంది డి.కృష్ణ, సాంబశివరావు, పాషా తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటికి ఇబ్బంది ఉండొద్దు

- వేసవిలో సరఫరా నిరంతరం ఉండాలి
- ఫీల్డ్ స్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలి
- కలెక్టర్ దివాకర

**వేద న్యూస్, ఖమ్మం :**

వేసవికాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. డ్రింకింగ్ వాటర్, సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, త్రాగునీటి సరఫరాపై సమన్వయం ఉండాలని, అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా ఫీల్డ్‌లో ఉండి సమస్యలను ప్రత్యక్షంగా పరిష్కరించాలని సూచించారు. ఎంపీడీఓలు, ఎంపీఓలు క్రమం తప్పకుండా ఫీల్డ్ విజిట్లు నిర్వహించాలని ఆదేశించారు. త్రాగునీటి సమస్యలు అన్ని శాఖల బాధ్యత అని స్పష్టం చేస్తూ, మిషన్ భగీరథ నీటిని ప్రాధాన్యంగా అందించి, అవసరమైతే స్థానిక వనరులు, బోర్‌వెల్స్, చివరికి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని దశలవారీ చర్యలను సూచించారు. పైప్‌లైన్ లీకేజీలను వెంటనే పరిష్కరించాలని, రోడ్డు పనుల్లో నష్టపోయిన పైప్‌లైన్ల ఖర్చును కాంట్రాక్టర్ల ద్వారా భరింపజేయాలని తెలిపారు. ఎత్తైన గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని, సమస్య తలెత్తిన వెంటనే స్పందించాలని సూచించారు. తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అందుబాటులో ఉన్న నిధులను సమర్థంగా వినియోగించాలని ఆదేశించారు. హీట్ వేవ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించి సన్‌స్ట్రోక్ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.



# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- మరొకరికి గాయాలు
- ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్, యజమాని పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాజుపల్లి గ్రామానికి చెందిన చింతనిప్పుల రాధ 100 రోజుల పనికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో, చింతం బుచ్చయ్య ఎక్సెల్ బైక్‌పై లిఫ్ట్ తీసుకుంది. ఎర్రబాగు వద్దకు చేరుకున్నప్పుడు అదే గ్రామానికి చెందిన పంచనేని దేవేందర్ రావు ట్రాక్టర్‌ను అతివేగంగా నడుపుతూ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ కిందపడగా, ట్రాక్టర్ టైరు రాధపై నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. చింతం బుచ్చయ్యకు గాయాలయ్యాయి. మృతురాలి కుమారుడు చింతనిప్పుల నాగరాజు ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్, యజమాని పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మహా ఉద్యోగ మేళా వేలాది అవకాశాలు



**వేద న్యూస్ పెద్దపల్లి :**

జిల్లా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో మే 6న మహా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. జిల్లా పరిపాలన యంత్రాంగం, తెలంగాణ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. పెద్దపల్లి పట్టణంలోని వెంకట పద్మావతి శీతలీకృత సమావేశ మందిరంలో ఈ ఉద్యోగ మేళా జరగనుంది. ఇందులో సుమారు 20 స్థానిక సంస్థలు, 48 ఇతర సంస్థలు కలిపి మొత్తం 68 సంస్థలు పాల్గొననున్నాయి. వీటి ద్వారా సుమారు 3439 ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ వెల్లడించారు. దూరసంచార సేవలు, వినియోగదారుల సహాయ కేంద్రాలు, విక్రయాలు, ప్రచారం, డిజిటల్ సేవలు, ఫీల్డ్ సేవల వంటి విభిన్న రంగాల్లో ఈ అవకాశాలు లభ్యమవుతాయని తెలిపారు. వేతనాలు రూ.18 వేల నుంచి రూ.80 వేల వరకు ఉండే అవకాశముందని పేర్కొన్నారు. పదవ తరగతి, అంతర్, పారిశ్రామిక శిక్షణ, డిప్లొమా, డిగ్రీ, ఔషధ విద్య, ఇంజినీరింగ్, నిర్వహణ విద్య వంటి అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ జీవన వివరాలు, ఆధార్ కార్డు, జిల్లా ఉపాధి పోర్టల్ నమోదు వివరాలతో హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా యువతకు తగిన ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, వారి కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

# పీఎస్ పరిధిలో ఆరు నెలల బాలిక కిడ్నాప్

**వేద న్యూస్ కుత్బుల్లాపూర్ :**



సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో 6నెలల బాలిక కిడ్నాప్ గురైంది. తల్లితో కలిసి రోడ్డు పక్కన నిద్రిస్తుండగా బైక్ పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని దుండుగులు బాలికను ఎత్తుకెళ్లిపోయారు. సూరారం మల్లారెడ్డి దవాఖాన ఎదురుగా ఉన్న మార్బుల్ షాప్ ముందు సోమవారం రాత్రి తల్లితో కలిసి నిద్రిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. తల్లి ఆశ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సిఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

**వేద న్యూస్ నిర్మల్ :**



జిల్లాలో సిఎంఆర్ డెలివరీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్మల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మిల్లులకు కేటాయించిన సిఎంఆర్ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, రైస్ మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సిఎంఆర్ డెలివరీలో ఎటువంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి దశలో పర్యవేక్షణ బలోపేతం చేయాలని పేర్కొన్నారు. రైస్ మిల్లర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించి డెలివరీ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వానికి అవసరమైన ధాన్యం నిల్వలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేందుకు అధికారులు ముందుండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, మేనేజర్ సుధాకర్, రైస్ మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. సమయానికి సిఎంఆర్ డెలివరీ పూర్తి చేయడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాలు సాధ్యమవుతాయని, ప్రజలకు అవసరమైన సరఫరాలు అంతరాయం లేకుండా కొనసాగుతాయని అధికారులు తెలిపారు

# ఫోన్ చార్జింగ్ 100 శాతం వరకా? 80 శాతం వరకా?




**వేద న్యూస్ డెస్క్:**

స్మార్ట్‌ఫోన్ వాడకం రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో బ్యాటరీ ఆరోగ్యం ఎలా కాపాడుకోవాలి అనే ప్రశ్న చాలా మందిలో ఉంది. ముఖ్యంగా ఫోన్‌ను 100 శాతం వరకు చార్జ్ చేయాలా లేక 80 శాతం దగ్గరే ఆపాలా అనే సందేహం ఎక్కువగా కనిపిస్తోంది. నిపుణుల ప్రకారం సరైన చార్జింగ్ అలవాట్లు పాటిస్తే బ్యాటరీ ఆయుష్షును గణనీయంగా పెంచుకోవచ్చు. ప్రస్తుతం ఎక్కువ ఫోన్లలో లిథియం అయాన్ బ్యాటరీలు ఉంటాయి. ఇవి పూర్తిగా 0 నుంచి 100 వరకు చార్జ్ చేయడం కంటే మధ్యలోనే ఉంచితే ఎక్కువకాలం బాగుంటాయి. సాధారణంగా 20 శాతం నుంచి 80 శాతం మధ్య చార్జ్ ఉంచడం ఉత్తమమని టెక్ నిపుణులు సూచిస్తున్నారు. దీన్ని పాటించడం వల్ల బ్యాటరీపై ఒత్తిడి తగ్గుతుంది.ఫోన్‌ను తరచూ 100 శాతం వరకు చార్జ్ చేయడం వల్ల బ్యాటరీపై ఎక్కువ వోల్టేజ్ పడుతుంది. దీర్ఘకాలంలో ఇది బ్యాటరీ సామర్థ్యాన్ని తగ్గించే అవకాశం ఉంది. అలాగే పూర్తిగా 0 శాతం వరకు వాడటం కూడా మంచిది కాదు. ఇది బ్యాటరీకి హానికరం కావచ్చు.అయితే రోజువారీ వినియోగంలో ప్రతి సారి 80 శాతం దగ్గర ఆపడం అందరికీ సాధ్యం కాదు. అలాంటి సందర్భాల్లో 100 శాతం వరకు చార్జ్ చేసినా పెద్ద సమస్యేమీ ఉండదు. కానీ ఇది అలవాటుగా మారకూడదు. అవసరమైనప్పుడు మాత్రమే పూర్తి చార్జ్ చేయడం మంచిది. కొత్తగా వస్తున్న కొన్ని ఫోన్లలో బ్యాటరీ రక్షణ కోసం ప్రత్యేక ఫీచర్లు కూడా ఉన్నాయి. ఇవి ఆటోమేటిక్‌గా 80 లేదా 85 శాతం దగ్గర చార్జింగ్ ఆపేస్తాయి. ఇలాంటి ఫీచర్లను ఉపయోగించడం ద్వారా బ్యాటరీ జీవితాన్ని పెంచుకోవచ్చు. మొత్తానికి, బ్యాటరీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే 20 నుంచి 80 శాతం మధ్య చార్జింగ్ ఉంచడం ఉత్తమం. అయితే అవసరాన్ని బట్టి 100 శాతం వరకు చార్జ్ చేయవచ్చు. సరైన అలవాట్లు పాటిస్తే ఫోన్ బ్యాటరీ ఎక్కువకాలం బాగుంటుంది.

# మొక్కజొన్నతో ఆరోగ్యం మెరుగుదల



- పోషకాలు పుష్కలంగా ఉన్న సహజ ఆహారం
- జీర్ణశక్తికి మేలు చేసే ధాన్యం
- రోజువారీ ఆహారంలో చేర్చితే అనేక లాభాలు

**వేద న్యూస్ డెస్క్:**

మొక్కజొన్న మన దేశంలో విస్తృతంగా వినియోగించే ధాన్యాల్లో ఒకటి. తినడానికి రుచిగా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలు అందిస్తుంది. తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండే ఈ ఆహారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమానంగా ప్రాధాన్యం పొందుతోంది. మొక్కజొన్నలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందించడంతో పాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. ముఖ్యంగా ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల కడుపు సంబంధిత సమస్యలు తగ్గే అవకాశం ఉంది. నిపుణుల ప్రకారం మొక్కజొన్నను ఆహారంలో చేర్చడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇందులో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఉన్న హానికర పదార్థాలను తగ్గించడంలో సహాయపడతాయి. కంటి ఆరోగ్యానికి కూడా ఇది మేలు చేస్తుంది. బరువు నియంత్రణలో కూడా మొక్కజొన్న ఉపయోగపడుతుంది. ఇది తిన్న తర్వాత ఎక్కువసేపు ఆకలి రాకుండా సహాయపడుతుంది. దీంతో అదనపు ఆహారం తీసుకోవడం తగ్గి బరువు నియంత్రణలో ఉంటుంది. మొక్కజొన్నను ఉడికించి, వేయించి లేదా పులుసు రూపంలో తీసుకోవచ్చు. అయితే ఎక్కువగా నూనె, ఉప్పు కలిపి తీసుకోవడం తగ్గించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. సహజంగా తీసుకుంటేనే పూర్తి ప్రయోజనాలు పొందవచ్చు. ఆహారంలో చిన్న మార్పులతో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. మొక్కజొన్నను నియమితంగా తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయని సూచిస్తున్నారు.

# పండ్లతో ఆరోగ్యం రోజుకు ఒక ఆపిల్ ఎందుకు అవసరం?

**వేద న్యూస్ డెస్క్:**

ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో పండ్లు కీలక పాత్ర పోషిస్తాయి. వాటిలో ఆపిల్ ప్రత్యేక స్థానం పొందింది. రోజుకు ఒక ఆపిల్ తింటే వైద్యుడిని దూరంగా ఉంచవచ్చని పాత నానుడి కూడా ఉంది. ఈ పండులో ఉండే పోషకాలు శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ఆపిల్‌లో విటమిన్ సి, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి. ముఖ్యంగా జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుంది. గుండె సంబంధిత సమస్యలను తగ్గించడంలో కూడా ఆపిల్ ఉపయోగపడుతుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తపోటు నియంత్రణలో కూడా ఇది కీలకంగా పనిచేస్తుంది. బరువు తగ్గాలనుకునేవారికి ఆపిల్ మంచి ఎంపిక. తక్కువ క్యాలరీలు ఉండటంతో పాటు ఎక్కువసేపు ఆకలి తగ్గిస్తుంది. దీనివల్ల అధిక ఆహారం తీసుకునే అలవాటు తగ్గుతుంది. చర్మ సౌందర్యాన్ని పెంచడంలో కూడా ఆపిల్ సహాయపడుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని తాజాగా ఉంచి ముడతలను తగ్గించడంలో ఉపయోగపడతాయి. అందువల్ల రోజువారీ ఆహారంలో ఆపిల్‌ను చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు. చిన్న అలవాటు పెద్ద మార్పును తీసుకురాగలదని నిపుణులు సూచిస్తున్నారు.



# పిల్లల్లో ముక్కులో, నోట్లో వేళ్లు పెట్టే అలవాటు ఇన్ఫెక్షన్లకు దారి



- అలవాటుతో పెరుగుతున్న ప్రమాదాలు
- ఆరోగ్యంపై ప్రభావం ఎలా ఉంటుంది
- తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

**వేద న్యూస్ డెస్క్:**

పిల్లల్లో సాధారణంగా కనిపించే అలవాట్లలో ముక్కులో లేదా నోట్లో వేళ్లు పెట్టుకోవడం ఒకటి. ఇది చిన్న విషయం అనిపించినా, ఆరోగ్యపరంగా ఇది అనేక ఇన్ఫెక్షన్లకు కారణమవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చిన్న వయసులోనే ఈ అలవాటును నియంత్రించకపోతే, పిల్లలు తరచుగా జబ్బులకు గురయ్యే అవకాశాలు ఉంటాయి. పిల్లలు బయట ఆడుకోవడం, పాఠశాలలో ఇతర పిల్లలతో కలవడం వల్ల చేతులపై బ్యాక్టీరియా, వైరస్‌లు సులభంగా చేరుతాయి. చేతులు శుభ్రంగా లేకుండానే ముక్కులో లేదా నోట్లో వేళ్లు పెట్టుకుంటే, ఈ సూక్ష్మజీవులు నేరుగా శరీరంలోకి ప్రవేశిస్తాయి. ముఖ్యంగా గోళ్ల కింద ఉండే మలినాలు ఇన్ఫెక్షన్‌కు ప్రధాన కారణంగా మారుతాయి. ఈ అలవాటు వల్ల ముక్కులో చిన్న గాయాలు, పుండ్లు ఏర్పడే అవకాశం ఉంది. అలాగే జలుబు, ఫ్లూ వంటి వ్యాధులు త్వరగా సోకుతాయి. నోటిలో వేళ్లు పెట్టడం వల్ల దంత సమస్యలు, గమ్ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. కొన్ని సందర్భాల్లో పిల్లలు చేతులపై ఉన్న జర్మ్స్‌ను మింగడం వల్ల కడుపు సమస్యలు కూడా తలెత్తుతాయి. వైద్యులు చెబుతున్న ప్రకారం, ఈ అలవాటు ఎక్కువగా చిన్న పిల్లల్లో కనిపిస్తుంది. ఇది ఒక రకమైన అలవాటు ప్రవర్తనగా మారిపోతుంది. పిల్లలు ఒత్తిడిలో ఉన్నప్పుడు లేదా విసుగుగా ఉన్నప్పుడు ఈ అలవాటును మరింతగా చేస్తారు. కాబట్టి ఇది కేవలం ఆరోగ్య సమస్య మాత్రమే కాకుండా, ప్రవర్తనా అంశంగా కూడా పరిగణించాలి. తల్లిదండ్రులు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. పిల్లలకు చేతులు శుభ్రంగా ఉంచుకోవడం గురించి అలవాటు చేయాలి. గోళ్లను చిన్నగా కట్ చేయడం, బయట నుంచి వచ్చిన వెంటనే చేతులు కడుక్కోవడం వంటి మంచి అలవాట్లు నేర్పాలి. అలాగే పిల్లలు వేళ్లు పెట్టకుండా ఉండేలా సున్నితంగా చెప్పాలి. పిల్లల్లో ఈ అలవాటు తగ్గించడానికి ప్రేమగా అవగాహన కల్పించడం అత్యంత అవసరం. శుభ్రతపై దృష్టి పెట్టడం ద్వారా పిల్లలను ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించవచ్చు. చిన్నప్పుడే మంచి అలవాట్లు నేర్పితే, వారి ఆరోగ్యం మెరుగ్గా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

# ద్రవిడ రాజకీయాల్లో నవశకం విజయ్ ప్రభంజనం



- తమిళనాడు ఎన్నికల్లో టీవీకే పార్టీ సంచలన విజయం
- దశాబ్దాల ఆధిపత్యానికి తెరదించిన సినీ నటుడి రాజకీయ ప్రస్థానం
- ప్రజా తీర్పుతో మారుతున్న దక్షిణ భారత రాజకీయ ముఖచిత్రం

**వేద న్యూస్ డెస్క్:**

తమిళనాడు రాజకీయ చరిత్రలో నిన్నటి ఫలితాలు ఒక చారిత్రక మలుపుగా నిలిచిపోతాయి. దశాబ్దాలుగా డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీల మధ్య సాగుతున్న ద్విధ్రువ రాజకీయాలకు నటుడు విజయ్ తెరదించారు. ఆయన స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తొలి ఎన్నికల్లోనే 108 స్థానాలను కైవసం చేసుకోవడం ఒక అద్భుతం. సినీ గ్లామర్‌తో పాటు పక్కా రాజకీయ ప్రణాళిక ఉండటం వల్లే ఈ విజయం సాధ్యమైందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, కొత్త తరం నాయకత్వం వైపు మొగ్గు చూపుతున్నారని ఈ తీర్పు స్పష్టం చేస్తోంది. విజయ్ తన రాజకీయ ప్రయాణాన్ని చాలా నిశ్శబ్దంగా, వ్యూహాత్మకంగా ప్రారంభించారు. పార్టీని ప్రకటించిన రోజు నుండి క్షేత్రస్థాయిలో సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించారు. అభిమాన సంఘాలను రాజకీయ శ్రేణులుగా మార్చడంలో ఆయన విజయం సాధించారు. ముఖ్యంగా యువత, మహిళా ఓటర్లు విజయ్ వెంటే ఉన్నారని ఎన్నికల గణాంకాలు చెబుతున్నాయి. సినీ రంగంలో ఉన్న క్రేజ్ కేవలం ఓట్లుగా మారుతుందా అనే అనుమానాలను పటాపంచలు చేస్తూ ఆయన తన సత్తా చాటారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రజల సమస్యలపై స్పందించడం ఆయనకు కలిసి వచ్చింది. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తన సొంత నియోజకవర్గంలో ఓడిపోవడం ఈ ఎన్నికల్లో అతి పెద్ద ఆశ్చర్యకరమైన విషయం. ఒక పార్టీకి తిరుగులేని మెజారిటీ రాకపోవడంతో హంగ్ అసెంబ్లీ ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. టీవీకే అతి పెద్ద పార్టీగా అవతరించడం వల్ల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బాధ్యత విజయ్ భుజాలపై ఉంది. ఇతర పార్టీల మద్దతు కూడగట్టడంలో ఆయన చూపే చొరవపైనే తమిళనాడు భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అధికార పక్షం వైఫల్యాలు, ప్రతిపక్షాల అసమర్థత విజయ్ గెలుపుకు మార్గం సుగమం చేశాయి. ఇది కేవలం ఒక వ్యక్తి గెలుపు కాదు, ఒక కొత్త ఆలోచన గెలుపు. సాధారణంగా నటులు రాజకీయాల్లోకి వచ్చినప్పుడు కేవలం వారి గ్లామర్ మీద ఆధారపడతారు. కానీ విజయ్ తన మేనిఫెస్టోలో సామాజిక న్యాయం, విద్య, వైద్యం వంటి అంశాలకు పెద్దపీట వేశారు. ద్రవిడ సిద్ధాంతాలకు తనదైన శైలిలో కొత్త నిర్వచనం ఇచ్చారు. అవినీతి రహిత పాలన అందిస్తామనే హామీ ప్రజల్లో బలంగా వెళ్లింది. క్లీన్ ఇమేజ్ ఉన్న నాయకుడి కోసం ఎదురుచూస్తున్న తమిళ తంబీలకు విజయ్ ఒక ఆశాకిరణంగా కనిపించారు. భావోద్వేగాలతో పాటు వాస్తవిక సమస్యలను చర్చించడం వల్ల ఆయన ఓట్లు సాధించగలిగారు.ఈ విజయం పొరుగు రాష్ట్రాల్లో ఉన్న సినీ ప్రముఖులకు కూడా ఒక కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. ప్రజాక్షేత్రంలో పట్టు ఉంటే రాజకీయాల్లో ఏదైనా సాధించవచ్చని విజయ్ నిరూపించారు. ద్రవిడ రాజకీయాల కోటను బద్దలు కొట్టడం అంత సులభం కాకపోయినా, ఆయన తన పట్టుదలతో అది సాధించి చూపారు. ఇప్పుడు ఆయన ముందు ఉన్న సవాలు సుస్థిరమైన ప్రభుత్వాన్ని అందించడం. కూటమి రాజకీయాలను నేర్పుగా నడిపిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది. సంక్లిష్టమైన రాజకీయ పరిస్థితుల్లో ఆయన నిర్ణయాలు ఎలా ఉంటాయనేది ఉత్కంఠగా మారింది. గతంలో ఎంజీఆర్, జయలలిత వంటి వారు సినీ రంగం నుండి వచ్చి రాజకీయాలను శాసించారు. ఇప్పుడు అదే బాటలో విజయ్ ప్రస్థానం సాగుతోంది. అయితే ఇప్పటి పరిస్థితులు అప్పటికంటే భిన్నంగా ఉన్నాయి. సోషల్ మీడియా వాడకం, పెరిగిన రాజకీయ అవగాహన మధ్య ఆయన తన ఉనికిని చాటుకోవాల్సి వచ్చింది. టీవీకే పార్టీ సాధించిన ఓట్ల శాతం గమనిస్తే అది అన్ని ప్రాంతాల్లో విస్తరించి ఉన్నట్లు తెలుస్తోంది. నగరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా విజయ్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది భవిష్యత్తులో ఇతర జాతీయ పార్టీలకు కూడా ఒక పాఠం కానుంది. ప్రస్తుతం తమిళనాడులో చర్చల పర్వం మొదలైంది. ఏ పార్టీ మద్దతు లేకుండా టీవీకే సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కష్టం. స్వతంత్ర అభ్యర్థులు, చిన్న పార్టీల మద్దతు కోసం విజయ్ సంప్రదింపులు జరుపుతున్నారు. అధికార పీఠం ఎక్కడం కంటే ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడమే ఆయన ప్రాధాన్యత కావాలి. దశాబ్దాల తరబడి పేరుకుపోయిన సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత ఇప్పుడు కొత్త ప్రభుత్వంపై ఉంది. ప్రజల ఆశలు ఆకాశమంత ఎత్తులో ఉన్నాయి, వాటిని అందుకోవడంలో విజయ్ ఎంతవరకు సఫలమవుతారో చూడాలి. ముగింపుగా చెప్పాలంటే విజయ్ గెలుపు తమిళనాడు రాజకీయాల్లో ఒక నవశకాన్ని ప్రారంభించింది. పాత తరం రాజకీయాలకు కాలం చెల్లిందని, ప్రజలు కొత్త రక్తాన్ని కోరుకుంటున్నారని ఈ ఫలితాలు నిరూపించాయి. సినీ తెరపైనే కాకుండా రాజకీయ తెరపై కూడా విజయ్ అసలైన 'దళపతి' అనిపించుకున్నారు. రాబోయే ఐదేళ్లు తమిళనాడు అభివృద్ధి పథంలో నడవాలని అందరూ కోరుకుంటున్నారు. ఈ చారిత్రక విజయం ప్రజాస్వామ్య వ్యవస్థలో సామాన్యుడి ఓటుకున్న శక్తిని మరోసారి గుర్తు చేసింది. మార్పు మొదలైంది, అది గమ్యాన్ని చేరుకోవాలని ఆశిద్దాం.ప్పుడు అదే బాటలో విజయ్ ప్రస్థానం సాగుతోంది. అయితే ఇప్పటి పరిస్థితులు అప్పటికంటే భిన్నంగా ఉన్నాయి. సోషల్ మీడియా వాడకం, పెరిగిన రాజకీయ అవగాహన మధ్య ఆయన తన ఉనికిని చాటుకోవాల్సి వచ్చింది. టీవీకే పార్టీ సాధించిన ఓట్ల శాతం గమనిస్తే అది అన్ని ప్రాంతాల్లో విస్తరించి ఉన్నట్లు తెలుస్తోంది. నగరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా విజయ్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది భవిష్యత్తులో ఇతర జాతీయ పార్టీలకు కూడా ఒక పాఠం కానుంది. ప్రస్తుతం తమిళనాడులో చర్చల పర్వం మొదలైంది. ఏ పార్టీ మద్దతు లేకుండా టీవీకే సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కష్టం. స్వతంత్ర అభ్యర్థులు, చిన్న పార్టీల మద్దతు కోసం విజయ్ సంప్రదింపులు జరుపుతున్నారు. టీవీకే పార్టీ సాధించిన ఓట్ల శాతం గమనిస్తే అది అన్ని ప్రాంతాల్లో నగరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా విజయ్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇది భవిష్యత్తులో ఇతర జాతీయ పార్టీలకు కూడా ఒక పాఠం కానుంది.చేయడం కష్టం.

వేద న్యూస్

బుధవారం మే 06, 2026

# సైన్యంలోకి మహీంద్రా థార్ ఏటీవీ..



**వేద న్యూస్ డెస్క్:**

భారత సైన్యం సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా మహీంద్రా డిఫెన్స్ విభాగం కీలక అడుగు వేసింది. భద్రతా దళాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన టాక్టికల్ వాహనం 'మహీంద్రా ఏటీవీ'ను తాజాగా ఆవిష్కరించింది. మహీంద్రా థార్ రాక్స్ ప్లాట్‌ఫామ్‌పై ఆధారపడి అభివృద్ధి చేసిన ఈ వాహనం కఠినమైన భూభాగాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ సైనికులకు నమ్మకమైన సహాయకుడిగా నిలవనుంది. మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా ఈ వాహనాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయం చేస్తూ, ఇది తమ సంస్థ సాంకేతిక నైపుణ్యానికి, దృఢసంకల్పానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా తట్టుకుని నిలబడే శక్తి, ఎక్కడికైనా వెళ్లగలిగే సామర్థ్యం, అవసరాలకు అనుగుణంగా మారగలిగే లక్షణాలు ఈ వాహనానికి ప్రధాన బలం అని ఆయన వివరించారు. భద్రతా దళాలకు సేవ చేసే అవకాశం లభించడం గర్వకారణమని కూడా చెప్పారు. ఈ ఏటీవీ రూపకల్పనలో సైనిక అవసరాలను ప్రత్యేకంగా పరిగణలోకి తీసుకున్నారు. సాధారణ వాహనాల్లా కాకుండా ఇందులో బలమైన రోల్ కేజ్‌ను అమర్చారు, ఇది ప్రమాదకర పరిస్థితుల్లో సైనికులకు రక్షణగా నిలుస్తుంది. వాహనం కింది భాగానికి పూర్తి అండర్‌బాడీ ప్రొటెక్షన్ ఇవ్వడంతో పేలుళ్లు లేదా రాళ్ల దెబ్బల నుంచి రక్షణ లభిస్తుంది. అలాగే గన్ మౌంట్ ఏర్పాటు చేయడం ద్వారా యుద్ధ కార్యకలాపాల్లో నేరుగా ఉపయోగించుకునేలా రూపొందించారు. ముందు, వెనుక భాగాల్లో హెవీ-డ్యూటీ మెటల్ బంపర్లు, టో షాకిల్స్ అమర్చారు. అదనపు టైర్లను మోసుకెళ్లేందుకు ప్రత్యేక క్యారియర్, ఇంధన అవసరాల కోసం జెర్రీ క్యాన్ హోల్డర్ కూడా ఏర్పాటు చేశారు. దీని వల్ల దీర్ఘకాలిక ఆపరేషన్లలో కూడా వాహనం నిరంతరంగా ఉపయోగించుకోవచ్చు. ఈ వాహనంలో 2.2 లీటర్ల శక్తివంతమైన డీజిల్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది అధిక హార్స్‌పవర్, టార్క్‌ను అందిస్తూ కఠినమైన మార్గాల్లో సులభంగా ప్రయాణించేందుకు సహకరిస్తుంది. స్టీల్ వీల్స్, ప్రత్యేక ఆఫ్-రోడ్ టైర్లు వాడటం వల్ల ఇసుక, రాళ్లు, కొండప్రాంతాలు వంటి క్లిష్ట భూభాగాల్లో కూడా సమర్థవంతంగా నడుస్తుంది. రాత్రిపూట ఆపరేషన్లను దృష్టిలో ఉంచుకుని బ్లాక్‌అవుట్ లైట్లు ఏర్పాటు చేశారు. ఇవి శత్రువుల కంటపడకుండా ఆపరేషన్లు నిర్వహించేందుకు ఉపయోగపడతాయి. అంతేకాకుండా, ఈ వాహనం 'ఎయిర్‌డ్రాప్ రెడీ'గా రూపొందించబడింది. అంటే, విమానం నుంచి పారాచూట్ సహాయంతో నేరుగా యుద్ధ క్షేత్రంలో దింపే సామర్థ్యం ఇందులో ఉంది. ఇది అత్యవసర పరిస్థితుల్లో సైన్యానికి ఎంతో కీలకంగా మారుతుంది. మహీంద్రా ఏటీవీ అభివృద్ధిలో బెంగళూరుకు చెందిన ప్రాడ్ 4×4 సంస్థ కూడా భాగస్వామ్యం కావడం విశేషం. ఈ భాగస్వామ్యం ద్వారా వాహనాన్ని మరింత పటిష్ఠంగా, ఆధునిక సాంకేతికతతో రూపొందించారు. . భూభాగం, వాతావరణం ఎలా ఉన్నా, సైనికులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇది కీలక పాత్ర పోషించనుంది. ఈ వాహనం ద్వారా దేశ భద్రత మరింత బలోపేతం అవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# తరచుగా ఉద్యోగాలు మారితే లోన్ రావడం కష్టమా..?

**వేద న్యూస్ డెస్క్:**




అత్యవసర అవసరాల కోసం చాలామంది వ్యక్తిగత రుణాలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కొన్ని నిమిషాల్లోనే లోన్ మంజూరు చేస్తున్నప్పటికీ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. ముఖ్యంగా ఉద్యోగ స్థిరత్వం, జీతం, సిబిల్ స్కోర్ వంటి అంశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. నిపుణుల ప్రకారం తరచుగా ఉద్యోగాలు మారే వ్యక్తులకు రుణం మంజూరు కావడం కాస్త కష్టమవుతుంది. బ్యాంకులు అభ్యర్థి ఉద్యోగ చరిత్రను పరిశీలిస్తాయి. ఒకే ఉద్యోగంలో ఎక్కువ కాలం కొనసాగితే ఆర్థిక స్థిరత్వం ఉందని భావించి లోన్ త్వరగా మంజూరు చేస్తాయి. కానీ తరచుగా కంపెనీలు మారితే రుణం తిరస్కరణకు అవకాశం పెరుగుతుంది. కొత్త ఉద్యోగంలో చేరిన వెంటనే దరఖాస్తు చేస్తే బ్యాంకులు దానిని అనిశ్చిత కాలంగా పరిగణిస్తాయి. సాధారణంగా కనీసం ఆరు నెలలు ఒకే ఉద్యోగంలో కొనసాగిన తర్వాతే రుణం కోసం దరఖాస్తు చేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ప్రొబేషన్ పీరియడ్‌లో ఉన్న ఉద్యోగులకు కూడా రుణం మంజూరు అయ్యే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. ఈ సమయంలో ఉద్యోగ స్థిరత్వంపై స్పష్టత లేకపోవడంతో బ్యాంకులు రిస్క్‌గా భావిస్తాయి. అలాగే కాంట్రాక్ట్ లేదా ఫ్రీలాన్స్ ఉద్యోగాల్లో ఉన్నవారికి కూడా రుణాలు పొందడం కష్టం. అంతేకాకుండా సిబిల్ స్కోర్ కూడా కీలకంగా మారింది. మంచి క్రెడిట్ స్కోర్ మరియు సక్రమంగా ఉన్న క్రెడిట్ హిస్టరీ ఉంటేనే రుణం త్వరగా లభించే అవకాశం ఉంటుంది. ఒకేసారి అనేక బ్యాంకులకు దరఖాస్తు చేయడం కూడా క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొత్తానికి ఉద్యోగ స్థిరత్వం, ఆర్థిక ప్రవర్తన, సిబిల్ స్కోర్‌ఇవి కలిపి వ్యక్తిగత రుణం మంజూరులో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి.

# వాట్సప్‌లోనే మొబైల్ రీఛార్జ్..

**వేద న్యూస్ డెస్క్:**




ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్ వినియోగదారులకు మరో సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై మొబైల్ రీఛార్జ్ కోసం ఇతర యూపీఐ యాప్స్ లేదా టెలికాం వెబ్‌సైట్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా వాట్సప్‌లోనే రీఛార్జ్ చేసుకునే అవకాశం కల్పించింది. ఈ కొత్త ఫీచర్ ద్వారా ప్రీపెయిడ్ మొబైల్ నంబర్లకు సెకన్లలోనే రీఛార్జ్ పూర్తిచేయవచ్చు. వాట్సప్ హోమ్ స్క్రీన్‌లో కనిపించే రూపాయి గుర్తుపై క్లిక్ చేసి మొబైల్ రీఛార్జ్ ఆప్షన్ ఎంచుకోవడం ద్వారా ఈ సేవను ఉపయోగించవచ్చు. తరువాత మొబైల్ నంబర్ నమోదు చేసి, నెట్‌వర్క్ ఎంచుకుని అందుబాటులో ఉన్న ప్లాన్లలో ఒకదాన్ని సెలెక్ట్ చేయాలి. చివరగా యూపీఐ ద్వారా చెల్లింపు పూర్తిచేయడంతో రీఛార్జ్ ఆటోమేటిక్‌గా పూర్తవుతుంది. ఈ సేవను పేయూ సంస్థతో కలిసి వాట్సప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వంటి ప్రధాన నెట్‌వర్క్‌లకు ఈ ఫీచర్ పనిచేస్తోంది. వినియోగదారులు తమ కుటుంబ సభ్యుల మొబైల్ నంబర్లకు కూడా రీఛార్జ్ చేయవచ్చు. ప్రస్తుతం ఈ ఫీచర్ టెస్ట్ దశలో ఉండటంతో కొంతమంది వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉంది. త్వరలోనే పూర్తి స్థాయిలో అందరికీ విడుదల చేయనున్నట్లు సమాచారం. వాట్సప్ ఇప్పటికే యూపీఐ చెల్లింపులు, స్కానర్ ద్వారా పేమెంట్స్, మెట్రో టికెట్ బుకింగ్ వంటి సేవలను అందిస్తోంది. ఇప్పుడు రీఛార్జ్ ఫీచర్ కూడా చేరడంతో వినియోగదారులకు మరింత సౌలభ్యం కలుగనుంది. ఆండ్రాయిడ్ మరియు ఐఓఎస్ వినియోగదారులందరికీ ఈ సేవ త్వరలో అందుబాటులోకి రానుంది. డిజిటల్ చెల్లింపులను మరింత సులభతరం చేయడమే ఈ కొత్త ఫీచర్ ప్రధాన లక్ష్యమని వాట్సప్ పేర్కొంది.

# వెన్నునొప్పితో లక్నో మ్యాచ్‌కు దూరమైన హార్దిక్




**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ 2026లో భాగంగా ముంబై ఇండియన్స్ జట్టుకు అనుకోని ఎదురుదెబ్బ తగిలింది. జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యా వెన్నునొప్పి కారణంగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌కు చివరి నిమిషంలో దూరమయ్యాడు. మ్యాచ్ ప్రారంభానికి ముందు టాస్ సమయానికి హార్దిక్ మైదానంలో కనిపించకపోవడంతో అభిమానులు ఆశ్చర్యానికి గురయ్యారు. అతని స్థానంలో సూర్యకుమార్ యాదవ్ టాస్ వేసి జట్టును నడిపించాడు. హార్దిక్ అనారోగ్య కారణాల వల్ల అందుబాటులో లేదని జట్టు స్వల్పంగా మాత్రమే వెల్లడించింది. మ్యాచ్ అనంతరం ర్యాన్ రికెల్టన్ మాట్లాడుతూ, హార్దిక్ తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నాడని తెలిపారు. మ్యాచ్ రోజు మధ్యాహ్నం నుంచే అతని ఆరోగ్య పరిస్థితి క్షీణించిందని చెప్పారు. అయితే అతను త్వరలోనే కోలుకుని తదుపరి మ్యాచ్‌కు అందుబాటులోకి వస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. హార్దిక్ లేకపోయినా రోహిత్ శర్మ, రికెల్టన్‌లు జట్టుకు మంచి ఆరంభం ఇచ్చారు. బౌలింగ్ విభాగంలో కార్బిన్ బాష్ కీలక వికెట్లతో రాణించడంతో ముంబై ఇండియన్స్ విజయాన్ని నమోదు చేసింది. అయితే ప్లేఆఫ్స్ రేసులో ముంబై పరిస్థితి ఇంకా క్లిష్టంగానే ఉంది. మిగిలిన మ్యాచ్‌ల్లో గెలవాల్సిన అవసరం ఉండటంతో పాటు ఇతర జట్ల ఫలితాలపై కూడా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# కేఎల్ రాహుల్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు

**వేద న్యూస్ డెస్క్:**



ఐపీఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌తో ఆకట్టుకుంటున్నాడు. ఇప్పటివరకు ఆడిన 9 మ్యాచ్‌ల్లో 433 పరుగులు సాధించి టోర్నీలో రెండో అత్యధిక స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. పంజాబ్ కింగ్స్‌పై జరిగిన మ్యాచ్‌లో 67 బంతుల్లో 152 పరుగులు చేసి అజేయంగా నిలవడం అతని సత్తాకు నిదర్శనంగా నిలిచింది. ఈ సీజన్‌లో రెండు అర్ధ శతకాలు, ఒక భారీ శతకంతో అతను జట్టుకు కీలక ఆటగాడిగా మారాడు. తాజాగా నిర్వహించిన 'సూపర్ స్టార్స్' కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ తన కెరీర్ ప్రయాణంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తనను చాలా కాలం పాటు కేవలం టెస్టు ఆటగాడిగానే చూశారని, పరిమిత ఓవర్ల క్రికెట్‌కు తగిన ఆటగాడిగా గుర్తించలేదని చెప్పాడు. అయితే క్రమంగా తన ఆటతీరును మార్చుకుని ఇప్పుడు ఈ స్థాయికి చేరుకున్నానని వివరించాడు. టీ20 క్రికెట్‌లో గత మూడేళ్లలో వచ్చిన మార్పులను కూడా అతను ప్రస్తావించాడు. పవర్ ప్లేలో దూకుడుగా ఆడాల్సిన అవసరం పెరిగిందని, అందుకే తన బ్యాటింగ్ విధానంలో మార్పులు చేసుకున్నానని తెలిపాడు. జట్టు అవసరాలకు అనుగుణంగా ఆడటమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశాడు. తాను గెలిచినా ఓడినా సమతుల్యంగా ఉండటానికి ప్రయత్నిస్తానని, సాధించని వాటిపై బాధపడకుండా ఇప్పటికే సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటానని రాహుల్ చెప్పాడు. మరికొంత కాలం క్రికెట్ ఆడి మరిన్ని విజయాలు సాధించాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నాడు.

# బుమ్రా బౌలింగ్‌పై గవాస్కర్ తీవ్ర వ్యాఖ్యలు




**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ప్రదర్శనపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. లక్నో సూపర్ జెయింట్స్‌తో వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో బుమ్రా వేసిన వరుస నో బాల్స్‌పై గవాస్కర్ తీవ్రంగా స్పందించారు. మ్యాచ్ 14వ ఓవర్‌లో బుమ్రా వేసిన బంతుల్లో రెండు నో బాల్స్ రావడం, అందులో ఒకదానికి వికెట్ వచ్చినా అది చెల్లకపోవడంతో మ్యాచ్‌లో ఉత్కంఠ నెలకొంది. ఈ ఘటనపై కామెంట్రీ బాక్స్‌లో ఉన్న గవాస్కర్ అసహనం వ్యక్తం చేస్తూ, ఒక ప్రొఫెషనల్ క్రికెటర్‌గా ఇలాంటి తప్పులు అంగీకారయోగ్యం కాదని వ్యాఖ్యానించారు. గవాస్కర్ సూచించారు. గణాంకాల పరంగా చూస్తే బుమ్రా ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఆడిన 10 మ్యాచ్‌ల్లో కేవలం 3 వికెట్లు మాత్రమే తీసుకున్నారు. ప్రారంభ ఐదు మ్యాచ్‌ల్లో ఒక్క వికెట్ కూడా సాధించలేకపోవడం జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. అదేవిధంగా ఎక్కువ పరుగులు ఇవ్వడం కూడా ముంబై బౌలింగ్ విభాగంపై ఒత్తిడిని పెంచుతోంది. ప్రపంచ స్థాయి బౌలర్‌గా పేరున్న బుమ్రా ఈ సీజన్‌లో ఫామ్ కోల్పోవడం అభిమానుల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. రాబోయే మ్యాచ్‌లలో అతను తిరిగి లయలోకి వస్తాడా లేదా అన్నది ఆసక్తిగా మారింది.

# నితీశ్ రాకతో ఎస్ఆర్‌హెచ్‌కు ఊరట




**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు శుభవార్త అందింది. యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఆరోగ్యం మెరుగుపడటంతో, రాబోయే కీలక మ్యాచ్‌కు అతను అందుబాటులో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల కోల్‌కతా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అనారోగ్య కారణంగా అతను బెంచ్‌కే పరిమితం కావాల్సి రావడంతో జట్టుకు గణనీయమైన లోటు ఏర్పడింది. అయితే ప్రస్తుతం పరిస్థితి మారడంతో అభిమానుల్లో మళ్లీ ఉత్సాహం నెలకొంది. జట్టు ప్రధాన కోచ్ డేనియల్ వెటోరీ మాట్లాడుతూ, నితీశ్ ఆరోగ్యం గణనీయంగా మెరుగైందని తెలిపారు. అతను పంజాబ్ జట్టుతో జరిగే మ్యాచ్‌కు సిద్ధంగా ఉంటాడని ఆశాభావం వ్యక్తం చేశారు. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ కీలక పాత్ర పోషించే నితీశ్ వంటి ఆటగాడు జట్టులో ఉండటం పెద్ద బలమని ఆయన అభిప్రాయపడ్డారు. గత మ్యాచ్‌లో నితీశ్ లేకపోవడం సన్‌రైజర్స్ హైదరాబాద్ మిడిల్ ఆర్డర్‌పై ప్రభావం చూపింది. ఆ మ్యాచ్‌లో జట్టు పరాజయం పాలవ్వడం కూడా దీనికి కారణంగా భావిస్తున్నారు. మిడిల్ ఆర్డర్‌లో స్థిరత్వం లేకపోవడం వల్ల జట్టు ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో నితీశ్ తిరిగి జట్టులోకి రావడం బ్యాటింగ్ లైనప్‌కు లోతును తీసుకురానుంది.

# ప్లేఆఫ్స్ రేసు వేడెక్కింది.. మూడు జట్లకు గెలుపే తప్పనిసరి

**వేద న్యూస్ డెస్క్:**




ఐపీఎల్ 19వ సీజన్ లీగ్ దశ చివరి దశకు చేరడంతో ప్లేఆఫ్స్ రేసు మరింత ఉత్కంఠగా మారింది. కొన్ని జట్లు సేఫ్ జోన్‌లో ఉన్నప్పటికీ, మూడు జట్లకు మాత్రం ప్రతి మ్యాచ్ గెలవడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది. లక్నో, ముంబై, కోల్‌కతా జట్లు ప్రస్తుతం అత్యంత ఒత్తిడిలో ఉన్నాయి. లక్నో జట్టు మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లో తప్పనిసరిగా విజయం సాధించాలి. ఒక్క మ్యాచ్ ఓడినా ప్లేఆఫ్స్ అవకాశాలు దాదాపు ముగిసిపోతాయి. ముంబై జట్టు కూడా మిగిలిన మ్యాచ్‌ల్లో గెలవడమే కాకుండా ఇతర జట్ల ఫలితాలు, నెట్ రన్‌రేట్‌పై ఆధారపడాల్సిన పరిస్థితిలో ఉంది. కోల్‌కతా జట్టు కూడా ప్లేఆఫ్స్ ఆశలు కొనసాగించాలంటే మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లో విజయం సాధించాల్సిందే. ఇక పాయింట్ల పట్టికలో పైభాగంలో ఉన్న పంజాబ్, బెంగళూరు జట్లు రెండు విజయాలు సాధిస్తే ప్లేఆఫ్స్ బెర్త్ దాదాపు ఖాయం చేసుకునే అవకాశం ఉంది. హైదరాబాద్, రాజస్థాన్, గుజరాత్ జట్లు మిగిలిన మ్యాచ్‌ల్లో కనీసం రెండు విజయాలు సాధిస్తే ప్లేఆఫ్స్ అవకాశాలు బలపడతాయి. చెన్నై, ఢిల్లీ జట్లు మాత్రం జాగ్రత్తగా ఆడాల్సిన పరిస్థితిలో ఉన్నాయి. మిగిలిన మ్యాచ్‌ల్లో తగిన విజయాలు సాధించకపోతే ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకోవాల్సి రావచ్చు. ఈ కీలక దశలో జట్ల ప్రదర్శన ఎలా ఉండబోతోందన్నదే అభిమానుల్లో ప్రధాన ఆసక్తిగా మారింది.

వేద న్యూస్

బుధవారం మే 06, 2026

# మళ్లీ కలిసిన చరణ్ సుకుమార్



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో విజయవంతమైన కాంబినేషన్‌లలో ఒకటిగా నిలిచిన రామ్ చరణ్‌సుకుమార్ జోడీ మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. వీరిద్దరి కలయికలో వచ్చిన రంగస్థలం చిత్రం అప్పట్లో భారీ విజయాన్ని అందుకుని, విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు అదే కాంబోలో కొత్త చిత్రం తెరకెక్కనుండటంతో సినీ వర్గాల్లో భారీ ఆసక్తి నెలకొంది.ప్రస్తుతం 'ఆర్‌సీ 17' (వర్కింగ్ టైటిల్) పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా చిత్రీకరణ జూలై నెలలో ప్రారంభం కానుందని తెలుస్తోంది. ఇప్పటికే దర్శకుడు సుకుమార్ కథను పూర్తి చేసి, స్క్రిప్ట్‌కు చివరి మెరుగులు దిద్దుతున్నట్లు సమాచారం. కథాంశం విషయానికి వస్తే, 'రంగస్థలం' తరహాలోనే గ్రామీణ నేపథ్యంతో పాటు భావోద్వేగాలు, మాస్ అంశాలు కలగలిపి రూపొందించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.ఈ చిత్రానికి సంగీతాన్ని దేవి శ్రీ ప్రసాద్ అందించనుండటం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గతంలో 'రంగస్థలం'లో ఆయన అందించిన సంగీతం ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. అదే స్థాయిలో ఈ చిత్రానికి కూడా సంగీతం ప్రధాన బలం అవుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.ఇదిలా ఉండగా, రామ్ చరణ్ నటించిన తాజా చిత్రం పెద్ది త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ క్రీడా నేపథ్య యాక్షన్ డ్రామా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో చరణ్ 'పెద్ది పెహిల్వాన్' పాత్రలో కనిపించనుండగా, కథానాయికగా జాన్వీ కపూర్ నటిస్తోంది. అలాగే శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.వరుస భారీ ప్రాజెక్టులతో రామ్ చరణ్ కెరీర్ మరింత బిజీగా మారుతున్న నేపథ్యంలో, సుకుమార్‌తో ఈ కొత్త సినిమా ఆయన అభిమానులకు మరో ప్రత్యేక అనుభూతిని అందించనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి, ఈ కాంబో మళ్లీ ఏ రేంజ్‌లో మ్యాజిక్ సృష్టిస్తుందో చూడాలి.

# 'టాక్సిక్' వివాదానికి కియారా చెక్

**వేద న్యూస్ డెస్క్:**



కన్నడ స్టార్ హీరో యష్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' చుట్టూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ కొనసాగింది. ముఖ్యంగా ఇందులో హీరోయిన్‌గా నటిస్తున్న కియారా అద్వానీ పాత్రపై వచ్చిన వార్తలు ఈ సినిమాను మరింత హాట్ టాపిక్‌గా మార్చాయి. సినిమాలో ఆమెపై చిత్రీకరించిన బోల్డ్ సన్నివేశాలపై అనేక ఊహాగానాలు వినిపించడంతో, ఈ చిత్రం విడుదలకు ముందే వివాదాల్లో చిక్కుకున్నట్టైంది. సోషల్ మీడియాలో వైరల్ అయిన కథనాల ప్రకారం, సినిమాలోని కొన్ని ఘాటైన సన్నివేశాలను తొలగించమని లేదా మార్చాలని కియారా మేకర్స్‌ను కోరిందన్న ప్రచారం విస్తృతంగా సాగింది. టీజర్‌లో కనిపించిన గ్లామర్ షాట్లు, విజువల్స్ కారణంగా ఈ ప్రచారం మరింత వేగం అందుకుంది. దీంతో 'టాక్సిక్'లో బోల్డ్ కంటెంట్ ఎక్కువగా ఉంటుందనే అభిప్రాయం ప్రేక్షకుల్లో బలపడింది. అభిమానులు, సినీ వర్గాలు కూడా ఈ అంశంపై చర్చించుకోవడం ప్రారంభించాయి. అయితే ఈ ప్రచారానికి తెరదించుతూ కియారా అద్వానీ స్వయంగా స్పందించడం కీలక మలుపుగా మారింది. తన సామాజిక మాధ్యమ వేదికగా ఆమె స్పష్టం చేస్తూ, తాను ఎలాంటి సన్నివేశాల విషయంలోనూ మార్పులు కోరలేదని, బయటకు వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవేనని వెల్లడించింది. ఈ ఒక్క ప్రకటనతోనే సోషల్ మీడియాలో నడుస్తున్న అన్ని ఊహాగానాలకు చెక్ పడింది. దీంతో సినిమా టీమ్ కూడా ఊపిరి పీల్చుకున్నట్టైంది. టీజర్ విడుదలైనప్పటి నుంచి కియారా పాత్రపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆమె లుక్, స్క్రీన్ ప్రెజెన్స్, స్టైలింగ్ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు కథపై ఆసక్తిని పెంచాయి. ముఖ్యంగా యష్‌తో ఆమె కెమిస్ట్రీ ఎలా ఉంటుందన్నదానిపై కూడా అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అయితే అధికారిక సమాచారం లేకుండానే సోషల్ మీడియాలో వ్యాప్తి చెందిన పుకార్లు ఈ సినిమాపై అనవసర వివాదాన్ని రేకెత్తించాయి. ఈ చిత్రాన్ని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్నారు. కథ, నిర్మాణ విలువలు, విజువల్ ట్రీట్ పరంగా ఈ సినిమా ప్రత్యేకంగా ఉండబోతోందని చిత్ర బృందం చెబుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. యాక్షన్, డ్రామా, ఎమోషన్ మేళవింపుతో రూపొందుతున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. మొదట ఈ చిత్రాన్ని జూన్ 4న విడుదల చేయాలని యోచించినప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల విడుదల వాయిదా పడింది. ప్రస్తుతం కొత్త విడుదల తేదీని ఖరారు చేసే పనిలో చిత్రబృందం ఉన్నట్లు సమాచారం. అభిమానులు ఈ అప్డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా యష్ తదుపరి చిత్రం కావడంతో 'టాక్సిక్'పై అంచనాలు మరింతగా పెరిగాయి. మొత్తానికి, ధృవీకరించని సమాచారం సోషల్ మీడియాలో ఎంత వేగంగా వ్యాప్తి చెందుతుందో ఈ ఘటన మరోసారి స్పష్టంచేసింది. అధికారిక ప్రకటనలకే ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ వివాదం బలంగా గుర్తుచేసింది. కియారా క్లారిటీతో ఈ వివాదం ముగిసినప్పటికీ, సినిమా విడుదల వరకు ఇలాంటి ప్రచారాలు కొనసాగకుండా జాగ్రత్త అవసరమని సినీ విశ్లేషకులు సూచిస్తున్నారు.

# ఫౌజీ చిత్రబృందానికి ప్రమాదం






**వేద న్యూస్ డెస్క్:**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ' సినిమా చిత్రబృందానికి విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడిన ఘటన సినీ వర్గాలను కలచివేసింది. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రం షూటింగ్ వేగంగా కొనసాగుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్ సమీపంలో చిత్రబృందం ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ఘటనలో ప్రొడక్షన్ విభాగానికి చెందిన ఒక వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో చిత్రబృందం, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. షూటింగ్ పనుల నిమిత్తం బయలుదేరిన సమయంలోనే ఈ ప్రమాదం జరగడం మరింత విషాదాన్ని మిగిల్చింది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ భారీ వ్యయంతో నిర్మిస్తోంది. సినిమాలో ప్రభాస్ సరసన ఇమాన్వీ కథానాయికగా నటిస్తుండగా, మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్, రాహుల్ రవింద్రన్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి కుటుంబానికి సంతాపం తెలియజేసిన చిత్రబృందం, వారికి ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. ప్రస్తుతం గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

# చిరుతో విజయ్ తండ్రి మూడు సినిమాలా?



**వేద న్యూస్ డెస్క్:**

కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన నేపథ్యంలో ఆయన కుటుంబానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా విజయ్ తండ్రి ఎస్.ఏ. చంద్రశేఖర్‌కు టాలీవుడ్‌తో ఉన్న అనుబంధం మరోసారి చర్చనీయాంశంగా మారింది. మెగాస్టార్ చిరంజీవితో ఆయన ఒకటి కాదు.. మూడు సినిమాలు తెరకెక్కించారనే విషయం చాలా మందికి తెలియకపోవడం విశేషం. విజయ్ సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి ఇండస్ట్రీలోకి వచ్చారు. ఆయన తల్లి శోభ గాయని, రచయిత్రి మాత్రమే కాకుండా నిర్మాతగా, దర్శకురాలిగానూ పని చేశారు. ఇక తండ్రి ఎస్.ఏ. చంద్రశేఖర్ దర్శకుడు, నిర్మాత, రచయితగా దక్షిణాది సినీ పరిశ్రమలో ప్రత్యేక స్థానం సంపాదించారు. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో కూడా ఆయన అనేక చిత్రాలకు దర్శకత్వం వహించారు. మొత్తంగా డెబ్బైకి పైగా సినిమాలు తెరకెక్కించి తనదైన ముద్ర వేశారు. తెలుగు ప్రేక్షకులకు ఆయన పరిచయం అయిన మొదటి చిత్రం 'చట్టానికి కళ్ళు లేవు'. చిరంజీవి, లక్ష్మి, మాధవి ప్రధాన పాత్రల్లో వచ్చిన ఈ సినిమా ఆయన తమిళ చిత్రానికి రీమేక్‌గా తెరకెక్కింది. ఈ చిత్రం విడుదలైన వెంటనే మంచి విజయాన్ని సాధించి చంద్రశేఖర్‌కు టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఆ తర్వాత చిరంజీవి, రాధిక జంటగా వచ్చిన 'పల్లెటూరి మొనగాడు' కూడా ఆయన దర్శకత్వంలో రూపొందింది. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుని వాణిజ్యపరంగా విజయం సాధించింది. ఇదే తరహాలో చిరంజీవి, విజయశాంతి ప్రధాన పాత్రల్లో వచ్చిన 'దేవాంతకుడు' కూడా మంచి స్పందన అందుకుంది. ఈ మూడు చిత్రాలు చిరంజీవి కెరీర్ ఎదుగుదలకు కూడా తోడ్పడ్డాయి. ఈ సినిమాల్లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే, విజయ్ తల్లి శోభ ఈ చిత్రాలకు కథలను అందించడం. అంటే విజయ్ కుటుంబం మొత్తం కలిసి తెలుగు సినీ పరిశ్రమలో చిరంజీవితో పని చేయడం జరిగింది. దీంతో వారి మధ్య ఉన్న అనుబంధం మరింత బలపడింది. ఇలా చూస్తే విజయ్ కుటుంబానికి తెలుగు సినిమాతో, ముఖ్యంగా చిరంజీవితో ఉన్న అనుబంధం చాలా పాతదని చెప్పాలి. ప్రస్తుతం ఈ విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.అయిన మొదటి చిత్రం 'చట్టానికి కళ్ళు లేవు'. చిరంజీవి, లక్ష్మి, మాధవి ప్రధాన పాత్రల్లో వచ్చిన ఈ సినిమా ఆయన తమిళ చిత్రానికి రీమేక్‌గా తెరకెక్కింది. ఈ చిత్రం విడుదలైన వెంటనే మంచి విజయాన్ని సాధించి చంద్రశేఖర్‌కు టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఆ తర్వాత చిరంజీవి, రాధిక జంటగా వచ్చిన 'పల్లెటూరి మొనగాడు' కూడా ఆయన దర్శకత్వంలో రూపొందింది. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుని వాణిజ్యపరంగా విజయం సాధించింది. ఇదే తరహాలో చిరంజీవి, విజయశాంతి ప్రధాన పాత్రల్లో వచ్చిన 'దేవాంతకుడు' కూడా మంచి స్పందన అందుకుంది.

# కొత్త బంధాలపై తమన్నా వ్యాఖ్యలు

**వేద న్యూస్ డెస్క్:**



ప్రేమ, వ్యక్తిగత బంధాలపై నటి తమన్నా భాటియా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, ప్రేమ అనేది జీవితంలో ఒక్కసారి మాత్రమే జరగాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మనసుకు నిజంగా నచ్చిన వ్యక్తి దొరికే వరకు కొత్త బంధాలను వెతుక్కోవడంలో తప్పులేదని తమన్నా అన్నారు. ప్రతి సంబంధం మన జీవితానికి ఏదో ఒక పాఠాన్ని నేర్పుతుందని, ఆ అనుభవాలు వ్యక్తిగత ఎదుగుదలకు దోహదపడతాయని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రేమలో ఉన్నప్పుడు అది ఇద్దరికీ ఆనందాన్ని, ఎదుగుదలను ఇవ్వాలి గానీ, ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించేలా మారకూడదని ఆమె స్పష్టం చేశారు. అలాగే ప్రేమను ఒక లావాదేవీలా చూడకూడదని తమన్నా పేర్కొన్నారు. ఎదుటివారి నుంచి ఏదైనా ఆశించడం మొదలైతే అది నిజమైన ప్రేమ కాకుండా వ్యాపార సంబంధంలా మారిపోతుందని ఆమె అభిప్రాయపడ్డారు. నిజమైన ప్రేమ అనేది స్వేచ్ఛ, పరస్పర గౌరవం, అర్థం చేసుకోవడం వంటి విలువలపై నిలబడాలని ఆమె తెలిపారు. ఇటీవల ఆమె వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్ల నేపథ్యంలో చేసిన ఈ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా సంబంధాలపై ఆమె వ్యక్తపరిచిన స్పష్టమైన అభిప్రాయాలు యువతలో చర్చకు దారితీస్తున్నాయి.

# 'స్పిరిట్' రిలీజ్‌పై కొత్త టాక్




**వేద న్యూస్ డెస్క్:**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న స్పిరిట్ చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా విడుదల తేదీపై ఆసక్తికరమైన వార్తలు వెలువడుతున్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2027 మార్చిలో విడుదల చేయాలని యోచించినట్లు సమాచారం. అయితే ఇప్పుడు దర్శకుడు తన ప్రణాళికను మార్చినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. గతంలో ఆయన తెరకెక్కించిన యానిమల్ చిత్రం డిసెంబర్ 1న విడుదలై ఘనవిజయం సాధించడంతో, అదే తేదీని 'సెంటిమెంట్'గా తీసుకుని 'స్పిరిట్'ను కూడా 2027 డిసెంబర్ 1న విడుదల చేయాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడాల్సి ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్ తొలిసారి పవర్‌ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. సందీప్ రెడ్డి వంగ సినిమాల్లో హీరో పాత్రలు సాధారణంగా గాఢమైన భావోద్వేగాలతో, తీవ్రమైన మానసిక స్థితులతో ఉండటం తెలిసిందే. దీంతో ప్రభాస్‌ను ఆయన ఎలా చూపిస్తారో అన్న ఆసక్తి అభిమానుల్లో రోజురోజుకీ పెరుగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణానికి ముందు దశ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కథ, పాత్రల రూపకల్పన, సాంకేతిక అంశాలపై దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. ప్రభాస్ కూడా తన ఇతర భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, 'స్పిరిట్'పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. మొత్తానికి, విడుదల తేదీపై స్పష్టత రాకపోయినా 'స్పిరిట్' సినిమాపై ఉన్న అంచనాలు మాత్రం తగ్గేలా కనిపించడం లేదు. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073